


మళ్లీ అమ్మాయే పుట్టిందని..
తుప్పల్లోకి పడేసిన తల్లి

మామా అల్లుళ్ల సవాల్!





పెండ్యాల అచ్చిబాబు.. (ఇన్‌సెట్లో) కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు





రాజీవ్‌కృష్ణ సెన్నార్ .. (ఇన్‌సెట్లో) వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు

- కొవ్వూరులో ప్రధాన అభ్యర్థులు ముప్పిడి, తలారి..
- కానీ అచ్చిబాబు, రాజీవ్ కృష్ణ మధ్యే అసలు పోరు
- వైసీపీలో వర్గపోరుతో పరిస్థితి అంతా అస్తవ్యస్తం
- అందుకే వనిత మార్పు.. అయినా ఆ పార్టీది ఎదురీతే

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

కొవ్వూరు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు ఆసక్తికరంగానూ, రసవత్తరంగా మారాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ నుంచి ప్రధాన అభ్యర్థులు పోరు ఎలా ఉన్నప్పటికీ ఇక్కడ కింగ్‌మేకర్లుగా ఉన్న వరసకు మామా అల్లుళ్లు పెండ్యాల అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణ మధ్యే పోటీ అన్నట్టు కనిపిస్తోంది. నిజానికి ఇక్కడ పోటీ ఎప్పుడూ రసవత్తరమే. 1952లో ఏర్పడిన నియోజకవర్గం ఇది. అప్పట్లో జనరల్ స్థానంగా ఉండేది. తర్వాత నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఇది ఎస్సీ రిజర్వుడు స్థానమైంది. 2009 నుంచి ఇది ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఎన్నికలు జరుగుతున్నాయి. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పారిశ్రామికవేత్తలైన పెండ్యాల వెంకట కృష్ణబాబు కుటుంబమే ఈ ప్రాంతంలో రాజకీయం చేస్తుండేది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొవ్వూరు సహా కొన్ని నియోజకవర్గాల్లో కృష్ణబాబు, ప్రఖ్యాత పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, మాజీ కేంద్రమంత్రి బోళ్ల బులిరామయ్య ప్రభావం ఉండేది. వీరిదంతా ఒకే కుటుంబం. బంధువర్గం. తెలుగుదేశం ఏర్పడిన తర్వాత 1983 నుంచి 2019 వరకూ జరిగిన 9 ఎన్నికల్లో ఏడుసార్లు తెలుగుదేశం పార్టీనే గెలిచింది. 1983, 85,89, 94, 2004లో ఎమ్మెల్యేగా పెండ్యాల కృష్ణబాబు గెలిచారు. 1999లో ఒక్కసారే ఆయన ఓడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి జీఎస్ రావు గెలిచారు. 2009లో ఎస్సీ నియోజకవర్గంగా ఎన్నికలు జరగడంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కృష్ణబాబు సహకారంతో టీవీ రామారావు గెలిచారు. 2014 ఎన్నికలు వచ్చేసరికి కృష్ణబాబు వైసీపీకి సపోర్టు చేశారు. దాంతో ఆయన సోదరుడు పెండ్యాల అచ్చిబాబు తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించడం మొదలుపెట్టారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కేఎస్ జవహర్ గెలిచారు. మంత్రి అయ్యారు. 2019లో అభ్యర్థి విషయంలో భిన్నాభిప్రాయాలు రావడంతో ఇతర ప్రాంతం నుంచి వచ్చిన టీడీపీ మహిళా నేత వంగలపూడి వనిత ఇక్కడ బరిలో నిలిచారు. వైసీపీ గాలివీయడంతో ఆ ఎన్నికల్లో ఆమె సుమారు 25 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. వాస్తవానికి ఈ నియోజకవర్గం టీడీపీ కంచుకోట.

ఇక్కడ కింగ్‌మేకర్లుగా ఉన్న కృష్ణబాబు, అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణలే ప్రధాన పార్టీల అభ్యర్థులకు వెన్నుదన్నుగా ఉంటారు. అయితే ఈ నియోజకవర్గంలో ప్రతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు మారిపోతూ ఉంటారు. దీనికి గెలిచిన ఎమ్మెల్యేకు, స్థానిక నేతల మధ్య వివిధ కారణాల రీత్యా అగాధం ఏర్పడడం షరా మామూలే అయింది. ఇక 2014 ఎన్నికల తర్వాత కృష్ణబాబు రాజకీయ జోక్యం తగ్గించారు. ఆయన ఆరోగ్య ఇతర కారణాల రీత్యా ఆయన క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన స్థానంలో వైసీపీని నడిపించే బాధ్యత రాజీవ్‌కృష్ణ చేతికి వచ్చింది. 2014లో రాజీవ్‌కృష్ణ నిడదవోలు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి అప్పట్లో టీడీపీ హవా అధికంగా ఉండడం వల్ల టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు చేతిలో ఓడిపోయారు. తర్వాత ఆయన కొవ్వూరుకే పరిమితమై ఇక్కడ అభ్యర్థిని గెలిపించడం కోసం పనిచేస్తున్నారు. 2019లో తానేటి వనిత విజయం వెనుక రాజీవ్ సహకారం ఉంది. అదే సమయంలో టీడీపీ అభ్యర్థి బాధ్యత అచ్చిబాబు తీసుకున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. వైసీపీ అభ్యర్థిగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పోటీ చేస్తున్నారు. వీరు గోపాలపురంలో ఒకరిపై ఒకరు 2014, 2019లో పోటీపడి, 2014లో ముప్పిడి, 2019లో తలారి గెలిచారు. ఇద్దరూ ఈ ఎన్నికల్లో కొవ్వూరులో మూడోసారి తలపడుతున్నారు. వాస్తవానికి ఈ పోటీ ఈ ఇద్దరి మధ్య కాకుండా అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణ మధ్య పోటీగా మారింది. అచ్చిబాబు అన్న కృష్ణబాబు అల్లుడే రాజీవ్‌కృష్ణ. అంటే అచ్చిబాబుకు అల్లుడు వరస రాజీవ్ కృష్ణ సెన్నార్ ఈ నేపథ్యంలో ఇక్కడ కొవ్వూరు ఎన్నిక మామా అల్లుళ్ల సవాల్‌గా మారింది. 2019 ఎన్నికల్లో అల్లుడిదే పైచేయి అయింది. ఈసారి మామ అచ్చిబాబు పైచేయి సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈసారి వైసీపీకి ఎదురీతే..

వాస్తవానికి టీడీపీకి ఈ నియోజకవర్గం కంచుకోట. 2019 ఎన్నికలకు వచ్చే నెల 13న జరగబోయే ఎన్నికలకు తేడా ఉంది. ఇవాళ అధికారి వైసీపీ మీద తీవ్ర వ్యతిరేకత ఉంది. అంతేకాక ఇక్కడ గెలిచి హోంమంత్రి అయిన తానేటి వనిత ఇక్కడ దళిత వర్గాలకు వ్యతిరేకంగా వ్యవహరించడమే కాకుండా ముఖ్యవర్గానికి వ్యతిరేకంగా గ్రామాల్లో చిచ్చుపెట్టారనే విషయం తీవ్ర నష్టాన్ని తెచ్చింది. ఒక వర్గానికి చెందిన ఇద్దరు ముగ్గురు మాటలు విని ప్రధాన వర్గాన్ని దూరం చేసుకున్నారనే వాదన కూడా ఉంది. అంతేకాక ఆమెను అభ్యర్థిగా తెచ్చుకుని గెలిపించిన రాజీవ్‌కృష్ణకు కూడా వ్యతిరేకంగా వ్యవహరించడం ఇక్కడ వైసీపీకి సమస్యగా మారింది. అందుకే ఆమెను గోపాలపురం నియోజకవర్గానికి పంపించి అక్కడి ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఇక్కడ పోటీపెట్టారు. వనితను పక్క నియోజకవర్గానికి మార్చినప్పటికీ ఇక్కడ వర్గపోరు మాత్రం సర్దుమణగలేదు. అంతేకాక కొందరి మాటలు విని రాజీవ్‌కృష్ణను వేరే ప్రాంతానికి పరిశీలకుడిగా పంపించే ప్రయత్నం జరగడం, దాంతో ఆయన కొద్దిరోజులు సైలెంట్ అయ్యారు. తిరిగి వైసీపీ అధిష్ఠానం జరిగిన తప్పు తెలుసుకుని మళ్లీ ఆయనకు ఇక్కడ బాధ్యతలు అప్పగించింది. దాంతో ఆయన పార్టీ అభ్యర్థికి సంబంధించి ఎన్నికల సారథ్య బాధ్యతలను చేపట్టారు. కానీ ఇప్పటికే వైసీపీకి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఎంపీపీతోపాటు పలువురు నేతలు వైసీపీని వదిలి టీడీపీలో చేరారు. వైసీపీ అభ్యర్థి తలారి వెంక ట్రావు ఎన్నికల ప్రచారం సందర్భంగానూ పార్టీలో వర్గపోరు తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. జగన్ బస్సుయాత్ర, తలారి వెంకట్రావు నామినేషన్ దాఖలకు అవసరమైన ఏర్పాట్లకోసం చర్చించడానికి ఆదివారం సమావేశమైన సందర్భంలో వేదిక మీదకు ముఖ్యులను ఆహ్వానించే సమయంలో ఒకరు అడ్డుతగలడంతో కొట్టుకునే పరిస్థితి దాపురించింది. ఇలా పార్టీలో నెలకొన్న అనేక తలనొప్పులను సరిదిద్ది, ఎన్నికల ప్రణాళికను ముందుకు నడిపించే విషయంలో రాజీవ్‌కృష్ణ ఎంతవరకూ నెట్టుకొస్తారో చూడాలి. ఇక 2009లో టీడీపీ, కాంగ్రెస్, ప్రజారాజ్యం మధ్య త్రిముఖ పోటీ జరిగినప్పుడు కూడా ఇక్కడ టీడీపీ గెలిచింది. ఇవాళ టీడీపీ, జనసేన, బీజేపీ ఒకటిగా పోటీ చేస్తున్నాయి. పైగా ఎన్నడూ లేని విధంగా అచ్చిబాబు స్వయంగా గ్రామాల్లోకి కూడా వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈనేపథ్యంలో మే 13న ముప్పిడి వెంకటేశ్వరరావు, తలారి వెంకట్రావు మధ్య జరిగే ఎన్నిక అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణ మధ్య మామా అల్లుళ్ల సవాల్‌గా మారింది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి

మూడో ఆర్థిక శక్తిగా భారత్ ఆవిష్కరించబడాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 : ప్రపంచంలో మూడవ ఆర్థికశక్తిగా భారత్ ఆవిష్కరించబడేలా బీజేపీ కేంద్ర నాయకత్వం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిందని, దీన్ని ప్రజల ముందుకు తీసుకెళతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని లోక్‌సభ ఎన్నికల కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రొడక్టివిటీ పెరగడం వల్లే ఆర్థిక పరిస్థితి 11వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరుకున్నామని అన్నారు. సహజంగా పార్టీలోని నాయకులు వేర్వేరు రంగాల్లోని వారితో మాట్లాడి ఎన్నికల మేనిఫెస్టో రూపొందిస్తారని, దీనికి భిన్నంగా ప్రజామోదమైన మేనిఫెస్టో విడుదల చేయడం జరిగిందన్నారు. మేనిఫెస్టోకు రాష్ట్రం నుంచి వచ్చిన సూచనలు కూడా కేంద్రానికి పంపించామని తెలిపారు. సురక్షిత భారత్, సమృద్ధి భారత్‌ను మేనిఫెస్టోలో ఆవిష్కరించే ప్రయత్నం చేశారన్నారు. సంకల్ప్ పత్ర అని పేరు పెట్టడం ద్వారా వాటిని అమలు చేసే ధృఢ సంకల్పంతో బీజేపీ ముందుకు వెళుతుందన్నారు. మేనిఫెస్టోను కింది వర్గాల వరకూ తీసుకెళ్లే సంస్థాగతమైన బలం బీజేపీకి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సమర్థవంతమైన నాయకత్వం కూడా ఉందన్నారు. మేనిఫెస్టోలో 24 రంగాలు, పది సామాజికపరమైన అంశాలు ఉన్నాయన్నారు. ఈ పది వర్గాలకు సంక్షేమం అందించడం జరుగుతుందన్నారు. మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి దక్కుతాయని ఆమె స్పష్టంచేశారు. రాష్ట్రంలో స్మార్ట్ సిటీల కోసం కేంద్రం నిధులు ఇస్తున్నా, వాటిని రాష్ట్రం వినియోగించుకోవడంలో విఫలమైందన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.



దమ్మీ తలకట్టు, ముఖానికి ప్లాస్టర్లతో సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల

జగన్‌రెడ్డి నాటకాలు ప్రజలు నమ్మరు

ఓటమి భయంతోనే గులకరాయి దాడి చేయించుకున్న జగన్

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ/ రూరల్, ఏప్రిల్15: ప్రజలను ఇంకా మోసం చేయాలని జగన్‌రెడ్డి చేసే సానుభూతి ప్రయత్నాలు నమ్మే పరిస్థితి లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో తన అభిమానితో కోడికత్తి దాడి డ్రామాలు ఆడిన జగన్ సానుభూతి పొందాడన్నారు. ఈ ఐదేళ్లకాలంలో అసమర్థపాలనతో ప్రజల చీత్కారం ఎదుర్కొంటున్న జగన్ మళ్లీ సింపతి కోసం ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. వైసీపీ బస్సు యాత్రలో ఆ పార్టీ సామాజిక మాధ్యమాల విభాగాన్ని నడిపించే వారిలో ఒకరైన శ్రీధర్‌రెడ్డి నాలుగురోజుల కిందటే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తీవ్రమైన సంఘటనలు జరగొచ్చని పోస్టు చేశారని, దాని అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఈ జగన్నాటకమన్నారు. జగన్‌కు ఎవరు సలహా ఇస్తున్నారోకానీ అవి పనికిరానివన్నారు. జగన్‌పై దాడి జరిగినప్పుడు పోలీసులు గాడిదలు కాస్తున్నారా అని ప్రశ్నించారు. డీజీపీని వెంటనే సస్పెండ్ చేయకుండా ప్రభుత్వం ఎందుకు ఆగిందన్నారు. సంక్షేమం ముసుగులో జగన్ రాష్ట్రాన్ని దోచేశాడన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు లేవన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు కేంద్రంగా రాష్ట్రాన్ని జగన్ మార్చేశాడన్నారు. రాబోయే తరాలను తాకట్టుపెట్టే అధికారం జగన్‌కు ఎవరిచ్చారని, ఈ అప్పులు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. రాక్షసుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడని కనుక ప్రతిపక్షాలు అన్నీ ఏకమయ్యాయని, నాశనమైన రాష్ట్రాన్ని భారీ మరమ్మతులు చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. జగన్ కుట్రలు చేసినా సింపతి కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు అతన్ని నమ్మరని, కూటమి భారీ విజయాన్ని కైవసం చేసుకుని అధికారంలోకి రాబోతోందని చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, రూరల్ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, రూరల్ బీసీ సెల్ అధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు, పల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ ఆదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీట్ ఫైల్ చేసే విషయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిల్/జామీనుల విషయంలో ఖైదీల సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం మే 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్సైజ్ కేసులు పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు

ఇండియా కూటమితోనే రాజ్యాంగ పరిరక్షణ, ప్రత్యేక హోదా సాధ్యం

ఆత్మీయ సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావడం ద్వారానే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకున్న వాళ్లమవుతామని కూటమి నేతలు సీపీఐ రాష్ట్రకార్యదర్శి కే రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజులు స్పష్టంచేశారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి టీ అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి మధు అధ్యక్షతన జరిగిన కూటమి ఆత్మీయ సమావేశంలో వారు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, కొవ్వూరు అభ్యర్థిని అరిగెల అరుణకుమారి, గోపాలపురం అభ్యర్థి మార్టిన్ లూథర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీలకు కట్టబెడుతుందన్నారు. రైతుల రుణమాఫీకి ఆర్థిక వ్యవస్థ బాగోలేదని చెప్పి కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వేల కోట్లు రుణాలను మాఫీ చేస్తోందన్నారు. బీజేపీని వ్యతిరేకించే సీఎంలను సైతం జైళ్లలో నిర్బంధిస్తుందన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తామని చెప్పిన జగన్ మాట తప్పాడన్నారు. ఏపీకి న్యాయం జరగాలంటే ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని.. అది ఇండియా కూటమి వల్లనే సాధ్యమవుతుందన్నారు. దేశాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం వారంతా ఐక్యత చాటారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాజమహేంద్రవరం అభ్యర్థి బోడా వెంకట్ ప్రచార రథాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత డీవీవీఎస్ వర్మ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, సీపీఎం నగర కార్యదర్శి బి.రాజులోవ, బి.పవన్, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తులసి, జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మాజీ సైనికులు సేవలు అందించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: జిల్లాలో మే 13న జరిగే ఎన్నికల పోలింగ్ విధుల్లో మాజీ సైనికులు సేవలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే మాధవీలత కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో మాజీ సైనికుల అసోసియేషన్ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌కే మాధవీలత మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో సైనికుల సేవలు నిరుపమానం అన్నారు. పోలింగ్ సజావుగా సాగేందుకు మీవంతు సహకారం అందించాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కలగజేస్తామన్నారు. జిల్లా ఎస్పీతో సంప్రదించి మీ సేవలు ఎక్కడ అవసరమో తెలుసుకుని, ఆ మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మాజీ సైనికులు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 600 మంది మాజీ సైనికులు ఉన్నారని వారంతా సహకారాన్ని అందిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జీ నరసింహులు, జిల్లా మాజీ సైనికులు అసోసియేషన్ అధ్యక్షుడు జి ప్రసాదరావు, సెక్రటరీ జై చంద్రశేఖర్, కోశాధికారి, రాజేంద్రకుమార్, ఇతర మాజీ సైనికులు పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బంది శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే మాధవీలత - రాజమండ్రి

మైనారిటీలకూ ‘మొండిచేయి’

- ఇమామ్, మౌజన్‌ల జీతాలకు వక్ఫ్ సొమ్ములు
- ఆరు నెలలుగా భృతి మరిచిన ప్రభుత్వం
- గురువుల ఆవేదన చూడలేక అధికారుల చొరవ
- మైనారిటీలపై వైసీపీ ముందు నుంచీ చిన్నచూపే
- హజ్ రాయితీతో సహా పథకాలన్నీ తీసివేత

కుడి చేత్తో బటన్ నొక్కి.. ఎడమ చేత్తో ఆ సొమ్ములను లాగేసుకుంటూ ఐదేళ్లుగా హస్తలాఘవాన్ని చూపడంతోనే జగన్ పరిపాలనను సరిపెట్టారు. ఏ వర్గానికీ మేలు చేసిన దాఖలాలు లేవు. చివరికి.. నా మైనారిటీలంటూనే వాతలు పెట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేశారు. ముస్లిం గురువులకు జీతాలూ ఇవ్వకుండా పవిత్ర రంజాన్ మాసంలోనూ ఆవేదనకు గురిచేశారు. ఆరు నెలలుగా గురువుల ఆవేదన చూడలేక వక్ఫ్‌బోర్డు అధికారులు వేతనాలను విడుదల చేశారు. అదీ రంజాన్ ముగిసిన తర్వాత ఇవ్వడం గమనార్హం.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ప్రతి మసీదులో ఇమామ్, మౌజన్ ఉంటారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే తలంపుతో టీడీపీ ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ భృతిని ప్రవేశపెట్టింది. ఇమామ్‌కి రూ.5 వేలు, మౌజన్‌కి రూ.3 వేలు క్రమం తప్పకుండా గౌరవ భృతి అందేది. అయితే గత ఎన్నికల సందర్భంగా అలవికాని హామీలు వల్లెవేసిన జగన్.. ఇమామ్, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారు. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మరిచిపోయారు. నాలుగు ఏళ్లపాటు ముస్లింలు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఏడాది నుంచి ఇమామ్, మౌజన్‌లకు జీతాల పెంపు జరిగింది. అయితే ఆరు నెలల నుంచీ పెంచిన జీతాల మాట దేవుడెరుగు.. అసలు పైసా కూడా రాలేదు. రంజాన్ మాసంలోనూ గౌరవ భృతిని విడుదల చేయలేదు. దీంతో రంజాన్‌లో జిల్లాలోని 205 మసీదుల్లోని సుమారు 400 మంది ఇమామ్, మౌజన్లు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఆరు నెలల నుంచీ జీతాలు రాకపోవడంతో రంజాన్ వేళ అప్పుల కోసం తిప్పలు పడ్డారు. రంజాన్ మాసంలో మసీదులకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్న జగన్‌కి వారి కష్టాలు మాత్రం కనిపించలేదు. రంజాన్ ముగుస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదు. దీంతో గురువుల ఆవేదన చూడలేక సీఈవో, అధికారులు నిర్ణయం తీసుకొని వక్ఫ్ బోర్డు నుంచి జీతాలను చెల్లించారు. ఈనెల 11న రంజాన్ ముగియగా.. 12న వేతనాలను ఖాతాల్లో వేశారు. వక్ఫ్ బోర్డు చొరవ చూపకుంటే ప్రభుత్వం నుంచి పైసా వచ్చేది కాదంటూ గురువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నా' 'నా' అంటూనే నానాతంటాలూ పెట్టడం జగన్‌కి ఉన్న ప్రత్యేక లక్షణం. నా మైనారిటీలు అంటూనే అధికారంలోకి రాగానే వారికి అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేశారు. మసీదులు, శ్మశాన వాటికలు తదితర వాటి అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన వక్ఫ్‌బోర్డు నిధులనూ పాలకులు వాడుకున్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రకు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రాయితీలను కూడా రద్దు చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి రూ.60 వేలు, మిగతా వారికి రూ.30వేలు హజ్‌కి ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన జగన్ తర్వాత ఆ మాట మరిచారు. ముస్లింలు హజ్‌కి హైదరాబాద్‌లో విమానం ఎక్కేవారు. వైసీపీ ప్రచార యావతో విజయవాడ నుంచి విమానం అందుబాటులోకి తెచ్చింది. అయితే దీనివల్ల ఒక్కో యాత్రికుడిపై రూ.90వేల అదనపు భారం పడింది. ఒక్కపైసా కూడా ప్రభుత్వం భరించలేదు. టీడీపీ ప్రభుత్వంలో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులతో ఒక గైడ్‌ను పంపించేవారు. దీనికోసం మక్కా కనీసం ఓసారి వెళ్లిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేవారు. వైసీపీ పాలకులు గైడ్‌ల నియామకానికి ఎలాంటి ప్రక్రియ చేపట్టకుండా తమ కార్యకర్తలను నియమించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో గైడ్ అవకాశం కోసం ఎదురు చూస్తున్న విశ్రాంత ముస్లిం ఉద్యోగులు దగా పడ్డాయి. పేద, ధనిక అనే బేధం లేకుండా రంజాన్ ఆనందంగా జరుపుకోవాలని సంకల్పించి టీడీపీ ప్రభుత్వంలో రంజాన్ వచ్చిందంటే తోఫా పేరుతో కానుక అందజేసేవారు. తోఫాలో పప్పు, ఉప్పు, సేమియాలు, నెయ్యి, పసుపు వంటి ఇఫ్తార్ వంటకు అవసరమైన వస్తువులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక తోఫాను తీసేసింది. దాని స్థానంలో ప్రత్యామ్నాయం కూడా ఏమీ అందజేసే ఆలోచన చేయలేదు. గత ప్రభుత్వంలో రంజాన్ మాసం రాక ముందే మసీదుల మరమ్మతులు, రంగులు, ఎలక్ట్రికల్ తదితర పనుల కోసం నిధులు విడుదల చేసేవాళ్లు. గ్రామాల్లోని మసీదులకు రూ.15వేలు, పట్టణాల్లోని మసీదులకు రూ.25వేలు అందజేసేవారు. వైసీపీ పాలన వచ్చిన వెంటనే ఆ ఆర్థిక సహాయానికీ నీళ్లొదిలేశారు. పెళ్లి కానుక అంటూ 'దుల్హన్' పథకాన్ని తెరపైకి తెచ్చారు. దాన్నీ నిర్వీర్యం చేసేశారు. 10శాతం మందికి కూడా లబ్ధి చేకూరలేదు. గత ప్రభుత్వంలో చిరు వ్యాపారులకు ఉపాధి కోసం రూ.1లక్ష సబ్సిడీతో రూ.3లక్షల రుణం అందజేసేవారు. దుకాణ్ మకాన్ అనే మంచి పథకం అమలు చేసేవాళ్లు. ఈ స్కీంలో ఇల్లు కట్టుకొని అక్కడే మటన్, చికెన్ తదితర దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాఫీగా సాగించడానికి 100శాతం సబ్సిడీతో రుణం అందేది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తత్కాల్ పథకం కింద వక్ఫ్‌బోర్డు నుంచి రూ.10వేలు ఇచ్చేవారు. వితంతువులకు రూ.10వేలు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేది. విదేశీ విద్యకు ముస్లిం మైనారిటీలకు రూ.15లక్షల సహాయం చేసేవారు. ఈ సొమ్మును రెండు వాయిదాల కింద ఇచ్చేవాళ్లు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటన్నిటినీ రద్దు చేసింది. పైగా ఈ ప్రభుత్వం చేసిన నిర్వాకంతో ముస్లిం విద్యార్థులు విదేశాల్లో ముప్పుతిప్పలుపడ్డారు. కొందరు చదువు మధ్యలో ఆపేసి భారత్‌కి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఏడాదిలో రెండో విడత జమ చేయాల్సిన నిధులను విద్యార్థులకు ఇవ్వకపోవడం ఆ దుస్థితికి దారితీసింది. ముస్లింల బరియల్ గ్రౌండ్స్‌కి ప్రహరీ తదితర మౌలిక సదుపాయాలకూ పైసా విదల్చలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆర్భాటంగా మైనారిటీ కార్పొరేషన్, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్, నూర్‌బాషా కార్పొరేషన్, సంచార ముస్లిం జాతుల కార్పొరేషన్‌లను ఏర్పాటుచేశారు. కానీ ఒక్క కార్పొరేషన్‌కీ నిధులు, విధులు లేవు. కుర్చీలు కూడా లేని దుర్భర స్థితిలో ఆ కార్యాలయాలున్నాయి.

● కబుర్లతో కాలక్షేపం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు కబుర్లతో కాలక్షేపం చేయడం ప్రజలకు అనుభవపూర్వకంగా బోధపడిన విషయమే. ముస్లింల విషయంలోనూ అదే జరిగింది. గత ప్రభుత్వం సమయంలో జిల్లాలో 205 మసీదులు, 410 మంది ఇమామ్, మౌజన్‌లు ఉండగా ఐదేళ్లుగా ఈ ప్రభుత్వంలో ఒక్క అంకె కూడా వాటికి జతకాలేదు. 150 మసీదుల్లోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ భృతి కల్పించలేదు. 2019లో రాజమహేంద్రవరంలోని రెహమత్‌నగర్‌లో రూ.90 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. అప్పటి ఎంపీ మురళీ మోహన్ తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు ఇవ్వగా.. ప్రభుత్వం రూ.65 లక్షలు సమకూర్చింది. టెండరు కూడా ఖరారు అయ్యింది. తర్వాత ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం అధికారం పీఠమెక్కడం తెలిసిందే. దీంతో రూ.65 లక్షల నిధులూ వెనక్కి తీసేసుకున్నారు. ఇప్పుడు షాదీఖానా నిర్మిస్తామంటూ వైసీపీ నేతలు చెబుతుండడంపై ముస్లింలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

ముస్లింల పథకాలన్నీ రద్దే

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ముస్లింల పథకాలన్నీ రద్దు చేశారు. జగన్ మళ్లీ గెలిస్తే మా గురువుల జీతాలనూ తీసేస్తారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా 6 నెలల నుంచీ ఇమామ్, మౌజన్‌లకు జీతాల్లేవు. వక్ఫ్ బోర్డు దయతలచి గురువులకు జీతాలు చెల్లించింది. ఈ పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలోనే చూశాం. జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఎలా చేస్తుంది. ఈ ప్రభుత్వ హయాంలో మైనారిటీల జీవితాలు దుర్భరంగా మారాయి.

- షేక్ సుభాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్

నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు చురుగ్గా సన్నాహాలు


ధ్వజస్తంభం తయారీ చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఏప్రిల్ 15: రత్నగిరి వాసుడైన సత్యదేవుడి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ధ్వజస్తంభ కర్రను అనివేటి మండపం వద్దకు చేర్చగా సోమవారం నుంచి అడుగు భాగంలో రాగిరేకును అమర్చే పనులు చేపట్టారు. 5 అడుగులు మేర భూమి లోపల ఉండే ఈ కర్రకు ముందు రాగిరేకు అమర్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం మిగిలిన సుమారు 60 అడుగులకు రాగిరేకు దానిపై బంగారుపూతను అమర్చనున్నారు. దీనికి సుమారు 4 కోట్లు వ్యయం అవుతుంది. వైదిక కార్యక్రమాల నిర్వహణకు రావిచెట్టు ప్రాంగణంలో యాగాల నిర్వహణకు నూతన పందిరిని నిర్మించారు. 5 రోజుల పాటు జరిగే యాగములు, హోమములు, జపములు, ఇతర వైదికకార్యక్రమాలను ఈ యాగశాలలో నిర్వహిస్తారు. ఈనెల 18న ఉదయం 11 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ తదితర కార్యక్రమాలు అనంతరం తొలిరోజున నూతన ధ్వజస్తంభంకు జలాధివాసం, రెండో రోజున క్షీరాధివాసం, మూడో రోజున పుష్పాధివాసం, నాలుగో రోజున ధాన్యాధివాసంలో ఉంచి 22న ఉదయం కళాన్యాసము, శయ్యాధివాసం హోమ పూర్ణాహుతి అనంతరం ఉదయం 10.48కి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

నేటి నుంచి నవమి వేడుకలు

అన్నవరం, ఏప్రిల్ 15: సత్యదేవుడి ఆలయ క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న రత్నగిరి రామయ్య దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు రామాలయ ప్రాంగణంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించనున్నారు. 17 ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ, సీతారాములను వెండి ఆంజనేయవాహనంపై గ్రామోత్సవం నిర్వహించి ఉదయం 9.30కి సత్యదేవుడి వార్షిక కల్యాణ వేదికపై శ్రీరామనవమి సీతారాముల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. వైశాఖమాసంలో వచ్చే సత్యదేవుడి వార్షిక కల్యాణానికి సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తుండగా చైత్రమాసంలో వచ్చే సీతారాముల దివ్యకల్యాణానికి సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లు పెండ్లిపెద్దలుగా వ్యవహరిస్తారు. 18న ఆస్థానసేవ, 19న పండితసదస్యం, 20, 21 తేదీలలో నిత్యార్చనలు, ఆస్థానసేవ, 22న వనవిహారం, 23న చక్రస్నానం, 24న శ్రీపుష్పయోగంతో వేడుకలు ముగుస్తాయి. ఈ సందర్భంగా రామాలయానికి రంగులు వేసి విద్యుద్దీప అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

తక్కువ బరువుతో పుట్టిన కవలలకు పునర్జన్మ

జీజీహెచ్ వైద్యుల కృషితో సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి


వివరాలు వెల్లడిస్తున్న వైద్య బృందం

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 15: ఒకే కాన్పులో ముగ్గురు చొప్పున జన్మించి అతి తక్కువ బరువుతో ప్రాణాపాయంలో ఉన్న ఆరుగురు చంటి బిడ్డలకు కాకినాడ జీజీహెచ్ వైద్య బృందం ప్రత్యేక చికిత్సను అందజేసి పునర్జన్మను ప్రసాదించింది. పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయి ఇళ్లకు వెళుతున్న చిన్నారులకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సంధ్య, లక్ష్మీ వరప్రసాద్ దంపతులకు రెండో కాన్పులో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నెలలు నిండకుండానే 8వ నెలలో ఒక ఆడ పిల్లకు, ఇద్దరు మగ పిల్లలకు మొత్తం ముగ్గురికి జన్మనిచ్చింది. ఆడ పిల్ల 1500 గ్రాముల బరువు, ఒక మగ శిశువు 1000 గ్రాముల బరువు, మరో మగ శిశువు 620 గ్రాముల బరువుతో జన్మించారు. శిశువు తల్లి గర్భంలో పూర్తిగా ఎదగకపోవడంతో అవయవాలు ఎదుగుదల కూడా జరగలేదు. దీంతో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో 620 గ్రాముల బరువు ఉన్న శిశువును నవ జాత శిశు సంరక్షణ కేంద్రం(ఎన్ఐసీయు)కు తరలించి చిన్నపిల్లల వైద్యులు 72 రోజులు నిరంతరప్రాయంగా శ్రమించి ప్రత్యేక వైద్య చికిత్సను అందజేశారు. దీంతో ప్రస్తుతం ఆ మగ శిశువు 1700 గ్రాముల బరువు పెరిగి పూర్తిగా కోలుకున్నాడు. ఆడ శిశువు 2.5 కిలోలు, 1000 గ్రాముల బరువుతో పుట్టిన మరో మగ శిశువు 2.2 కిలోల బరువుతో పూర్తిగా కోలుకున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే పెద్దాపురానికి చెందిన సత్యప్రియాంక, సతీష్ దంపతులు గతనెల 13న ఒకే కాన్పులో ముగ్గురు కవలలు జీజీహెచ్‌లో జన్మించారు. వారు కూడా బరువు 1000, 1500 గ్రాముల మధ్య తక్కువ బరువు కలిగి ఉండి ప్రాణాపాయంలో ఉండడంతో పిడియాట్రిక్ వైద్య నిపుణులు 32 రోజుల పాటు శ్రమించి ప్రత్యేక వైద్య చికిత్సను అందజేయడంతో శిశువులు ముగ్గురు పూర్తి ఆరోగ్యదాయకంగా ఉన్నట్లు డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన జె.నాగమణి గత నెల 8న 1500 గ్రాములు, 910 గ్రాములు కవలలకు జన్మనిచ్చింది. కోరుకొండకు చెందిన దుర్గాభవాని 1500 గ్రాములు, 1000 గ్రాములు శిశువులకు జన్మనిచ్చారు. ఆ శిశువులను కూడా నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఉంచి 36 రోజులు పాటు ప్రత్యేక వైద్య బృందం కంటికి రెప్పలా కాపాడి పునర్జన్మను అందించారు. ఈ ప్రత్యేక వైద్యచికిత్సకు బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చవుతుందని, రాష్ట్రంలోని 11 బోధనాస్పత్రుల్లో కంటే కాకినాడ జీజీహెచ్ పిడియాట్రిక్ విభాగ వైద్య సేవలు ప్రత్యేకతను సంతరించుకున్నాయన్నారు. ప్రాణాపాయంలో ఉన్న చంటి బిడ్డలకు పూర్తిగా కోలుకునేలా వైద్య చికిత్సను అందజేసిన ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్.మాధవి, డాక్టర్ డీఎల్ విద్య, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ వి.విజయభాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ గణపతి సూర్యనారాయణ, నియోనటాలజీ వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ గౌతమిలను సూపరింటెండెంట్ అభినందించారు. జీజీహెచ్, చిన్న పిల్లల విభాగంలో నిష్ణాతులైన వైద్య నిపుణులు ఉన్నారని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు ఇక్కడ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావ్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, ఆర్ఎంవో డాక్టర్ యమున పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.90.90 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను దేవదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం తెరిచి లెక్కించారు. 26 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.70,39,801, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.20,51,049.. మొత్తం రూ.90,90,850 ఆదాయం లభించింది. బంగారం 22 గ్రాములు, వెండి 700 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర హుండీ ఆదాయం రూ.2,33,164 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భద్రాచలం రాముడికి కల్యాణ బొండాల సమర్పణ



మండపేట, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన కాజులూరి వెంకటరామారెడ్డి గత 24 ఏళ్ల నుంచి భద్రాచలం రాములవారి శ్రీరామనవమి వేడుకల కోసం కల్యాణ బొండాలు తయారీ చేసి అందిస్తున్నారు. ఆయన 2000 సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా స్వామివారికి బొండాలు అందిస్తున్నారు. ఉగాది రోజున బొండాలు తయారు చేయడం ప్రారంభించి పదిరోజులు వ్యవధిలోనే తయారీ పూర్తి చేశారు. మంగళవారం ఉదయం మండపేట నుంచి బొండాలను భద్రాచలానికి తరలిస్తున్నట్లు రామారెడ్డి తెలిపారు. అలాగే ఈనెల 22న కల్యాణం జరిగే ఒంటిమిట్ట రామాలయానికి కూడా బొండాలు పంపుతున్నానని రామారెడ్డి చెప్పారు. గొల్లలమామిడాడ లాంటి పలు ప్రసిద్ధి ఆలయాలకు కూడా బొండాలను పంపిస్తానని చెప్పారు.

నేడు రావులపాడు శివారులో సీఎం జగన్ బస


ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రావులపాలెం, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి సెంటరు సమీపంలోని ఒక ప్రైవేటు లే-అవుట్‌లో సీఎం జగన్ మంగళవారం రాత్రి బస చేస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి 10.30కు జగన్ బస చేసే ప్రాంతానికి చేరుకుంటారు. 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కోనసీమ జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం నిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రావులపాలెం కళా వెంకట్రావు సెంటరు మీదుగా జాతీయ రహదారిపై ఆలమూరు మండలం మడికి వరకు సుమారు మూడు గంటల పాటు బస్సు యాత్ర జరుగుతుంది.

ఫ్లోర్‌ఫ్రైడ్ ట్యాంకు సిలిండర్ నుంచి గ్యాస్‌లీక్


పరిశీలిస్తున్న పోలీసులు



జగ్గంపేట, ఏప్రిల్15: నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే ఫ్లోర్‌ఫ్రైడ్ ట్యాంకు సిలిండర్ నుంచి ప్రమాదకర గ్యాస్ లీకైంది. విషయం ఆలస్యంగా తెలిసినప్పటికీ జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే గ్యాస్ లీకేజీని అరికట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం నరేంద్రపట్నం పంచాయతీ పరిధిలోని బావారం గ్రామంలో రక్షిత మంచినీటి ప్రాజెక్టులో ఈ ఘటన సోమవారం జరిగింది. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 36 గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.24 కోట్లతో బావారం రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు. ఏలేరు జలాలు శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేసేవారు. అయితే ఇటీవల కాలం ఈ ప్రాజెక్టు అధికార వైసీపీకి చెందిన ప్రయివేట్ కాంట్రాక్టర్ల చేతిలోకి వెళ్లింది. ఇక అప్పటి నుంచి దీని నిర్వాహణ పూర్తిగా గాడి తప్పింది. ప్లాంట్లో శుభ్రత లేకుండా పోయింది. అసలు ప్లాంట్లో ఏం జరుగుతుందో కూడా బయటకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం గ్యాస్ లీకేజీ ఘటనకు బయటకు పొక్కకుండా చూసేందుకు కాంట్రాక్టర్లు నానా ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ తహసీల్దార్, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందడంతో ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తన సిబ్బందితో వచ్చి గ్యాస్‌లీకేజీని అదుపుచేసి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ ఇంతియాజ్‌బాషా సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ఈఫ్లోర్‌ఫ్రైడ్ ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశీలించడానికి ప్రత్యేకంగా సూపర్‌వైజర్ ఉండాలి కాని ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. దీంతో ఉద్యోగులు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. అసలే గ్రామానికి అతి దగ్గరగా ఉన్న ఈ ప్లాంట్ వల్ల తమ గ్రామానికి ఏం ముప్పు వాటిల్లుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ప్లాంట్ నిర్వాహణపై తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకరికి అస్వస్థత

జగ్గంపేట మండలం బావారం రక్షిత మంచినీటి పథకం గ్యాస్ లీకేజీ ఘటనలో ఒకరు అస్వస్థతకు లోనయ్యారు. వాటర్‌ప్లాంట్ పైపులైన్ వద్ద క్లోరిన్ గ్యాస్ సిలెండర్ వాల్వు లీకవడంతో అగ్నిమాపక సిబ్బంది సిలిండర్‌ను వాటర్ కూలింగ్ చేసి వాల్వు కట్టేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈఘటనలో గ్యాస్ పీల్చిన ఆపరేటర్ కంచి నాగేశ్వరరావు అస్వస్థతకు లోనవడంతో జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన అనంతరం ప్రస్తుతం కోలుకున్నట్లు తెలియజేశారు.

తనను దూరం పెడుతున్నాడని.. వ్యక్తి మర్మాంగాన్ని కోసేసిన యువతి

అల్లవరం, ఏప్రిల్ 15: తనను దూరం పెడుతున్నాడనే కోపంతో ఓ యువతి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి మర్మాంగాన్ని సగం కోసేసింది. ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం సామంతకుర్రు పంచాయతీ ఎస్.రామేశ్వరం తీర గ్రామంలో ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెళ్లికాని యువతికి, వివాహం అయిన చెక్క చినసత్తిబాబు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఈ మధ్య కాలంలో తనతో దూరంగా ఉండడమే కాక ఫోను చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో యువతి కక్ష పెంచుకుని ఆదివారం రాత్రి ఇంటికి రప్పించుకుని నిద్రపోతున్న సమయంలో సత్తిబాబు మర్మాంగాన్ని కోసేసింది. తీవ్ర రక్తస్రావం కాగా బాధితుడిని హుటాహుటిన అమలాపురం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ


సిబ్బందికి సూచనలిస్తున్న విజయ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారా తయారీ, రవాణా, విక్రయాలపై మరింత అప్రమత్తంగా ఉన్నామని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ స్పష్టం చేశారు. సోమవారం ఆమె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్‌ను పరిశీలించారు. సెబ్ జిల్లా అధికారి వి.సోమశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి అసిస్టెంట్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో పంపిణీ చేయడానికి మద్యం, సారా నిల్వ చేయడం, మాదకద్రవ్యాలు తదితర వాటిపై పటిష్టమైన నిఘాతో సమాచారం సేకరించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాశ్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను అనుసరించాలని సూచించారు. గోదాములు తదితర ప్రాంతాల్లోని పెద్ద మొత్తంలో మద్యం నిల్వలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. కాలిటీ, క్వాంటిటీ కేసులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, సారా, మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సెబ్ పోలీస్‌స్టేషన్‌కు ప్రజలు సమాచారం అందించాలని సెబ్ జిల్లా అధికారి సోమశేఖర్ సూచించారు. అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అక్రమ మద్యం, సారా, మాదక ద్రవ్యాల నిల్వ, రవాణా, విక్రయాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డా.ఎన్.నిక్సన్, ఎస్ఐ ఎం ఎస్ఎన్ శాస్త్రి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామేశంపేట చెక్‌పోస్టు తనిఖీ

రంగంపేట, ఏప్రిల్ 15: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో రామేశంపేట వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తనిఖీ చేశారు. ఎన్నికలు కోడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు చెక్‌పోస్ట్‌ల పని తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మద్యం, నగదు, ఇతర బహుమతులు రవాణా జరగకుండా చూడాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఈబీ రంగంపేట సీఐ ఎస్.రాంబాబు, పెద్దాపురం సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ టి.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ అమ్మాయే పుట్టిందని..

మగబిడ్డపై మమకారంతో నాలుగో సారి గర్భవతి అయిన మహిళ

భర్తకు సైతం తెలియని వైనం

అబ్బాయి పుడితే చెబుతామని..అమ్మాయి పుడితే వదిలించుకుందామనుకున్న మహిళ

అమ్మాయే పుట్టడంతో తుప్పల్లోకి..

గుర్తించిన స్థానికులు. బయటపడిన నిజం


తుప్పల్లో పడేసిన పాప

కడియం, ఏప్రిల్ 15: మగ సంతానంపై మమకారం పెంచుకున్న తల్లి మానవత్వం మరిచి అప్పుడే పుట్టిన పసికందును 20 అడుగుల ఎత్తులో నుంచి తుప్పల్లోకి విసిరేసింది. తర్వాత తన తప్పు తెలుసుకుని కన్నీరుపెట్టింది. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగింది. స్థానికులు, బంధువులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమగిరి గణపతినగర్‌కు చెందిన తాపీ పనిచేసే వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు.. వారు ప్రస్తుతం స్కూలుకు వెళుతున్నారు. అయితే సదరు వ్యక్తి భార్యకు మగసంతానంపై మమకారంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నట్టు నమ్మించి గర్భం దాల్చింది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది. అబ్బాయి పుడితే అందరికి చెబుదాం.. అమ్మాయి పుడితే మాయం చేద్దాం అనే ఉద్దేశంతో ఉంది. బంధుమిత్రులకు, పరిసర ప్రజలకు విషయం తెలియకుండా దాచింది. భర్తకు కూడా అనుమానం రాకుండా చేసింది. పొట్ట పెరుగుతుందని భర్త అనడంతో ఈ మధ్య తినడంతో పెరుగుతుందని నమ్మించింది. స్థానిక వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు తాను గర్భిణీ అనే విషయం ఇవ్వక పోగా అందుకు సంబంధించి వైద్యసేవలు పొందలేదు. ఆదివారం పురుటినొప్పులు వచ్చాయి. అది గమనించి తన భర్తను, పిల్లలను చర్చికి పంపింది. తనకు తానే పురుడు పోసుకుంది. అందుబాటులో ఉన్న కత్తిపీటతో పేగును కత్తిరించింది. అమ్మాయి పుట్టిందని గమనించిన వెంటనే ముందుగా అనుకున్న పథకం ప్రకారం నైటీలో పసికందును చుట్టి 20 అడుగుల ఎత్తు నుంచి తుప్పల్లోకి విసిరేసింది. అక్కడ చెత్తాచెదారం, పందులు ఉన్నాయి. అక్కడి నుంచి వెళ్లి స్నానం చేసి ఎవ్వరికీ తెలియనివ్వకుండా దాచింది. అయితే తుప్పలు నుంచి ఏడుపులు వినిపించడంతో చుట్టుప్రక్కల వారు వెళ్లి చూడగా ముద్దులొలికే ఆడశిశువు కనిపించింది. కాలికి చిన్న రాపిడి గాయం తప్ప క్షేమంగా ఉంది. పసికందు ఎవరనేది అందరిలో చర్చ మొదలైంది. బయట నుంచి అక్కడ ఎవరూ పసికందు పాడేసే అవకాశం లేనందున అక్కడి వారి పిల్లే అయి ఉంటుందని ఆరా తీశారు. ఇంతలో అందరితో పాటు భర్త వచ్చి చూస్తే పసికందుకు చుట్టి ఉన్న నైటీ కనిపించింది.. ఆ నైటీ తన భార్యదని గుర్తించాడు. ఆ నైటీ ఆధారంగా ఇంటికెళ్లి భార్యను నిలదీశాడు. దీంతో జరిగిన విషయం చెప్పింది. ఆపై ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. మగ సంతానంపై మమకారంతో ఇలా చేశానని గగ్గోలు పెట్టింది. తల్లీబిడ్డను కడియం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని బంధువులు, వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఏలేశ్వరం, ఏప్రిల్ 15: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని యర్రవరం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మహిళ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలేశ్వరం దిబ్బలపాలెంకు చెందిన పొన్నగంటి రామకృష్ణ కుమార్తె లోవదుర్గకు భీమవరానికి చెందిన ఎలుబోలు సురేష్ తో సుమారు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఏలేశ్వరం నుంచి వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఆటోలో వెళ్తుండగా యర్రవరం చెక్‌పోస్టు వద్దకు వెళ్లే సరికి ఆటోలో వెళ్తున్న లోవదుర్గకు వాంతులు అవ్వడంతో తమ తల బయటపెట్టి వాంతులు చేసుకొంటుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం లోవదుర్గ (29) తలను ఢీకొనడంతో తలకు బలంగా తగలడంతో రక్తం కారుతుండగా ఆటోలో ఉన్న వాళ్లు ఆటో డ్రైవర్ సాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఏలేశ్వరం ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేశారు.

హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై అధికారుల దాడులు

పిఠాపురం, ఏప్రిల్ 15: పిఠాపురం పట్టణంలోని హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో విజిలెన్స్ రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న డొమెస్టిక్(గృహ అవసరాల) సిలిండర్లును స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేవీఎస్‌ఎస్వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని స్టువర్టుపేటలో గల హరివిల్లు ఫుడ్స్‌ను తనిఖీ చేయగా ఏడు డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. హరివిల్లు ఫుడ్స్ యజమాని రావుల శేషుకుమార్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 6ఏ, ఎల్‌పీజీ చట్టం 2000 కింద కేసు నమోదు చేసి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలోని బిరియాని పాయింట్‌లో తనిఖీలు చేసి అయిదు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని యజమాని పిల్లా శ్రీనివాస్‌పై 6ఏ కింద కేసు నమోదు చేశారు. గృహ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్పీ హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, సీఎస్‌డీటీ ఇస్మాయిల్, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయ రాజగోపురంపై కలశాల స్థాపన



అంతర్వేది, ఏప్రిల్ 15: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఉత్తర రాజగోపుర కలశాల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం కలశల పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలయ అధికారులు కలశలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం క్రేన్ సాయంతో ఉత్తర రాజగోపురంపై కలశలను అర్చకులు ప్రతిష్ఠించారు. అనంతరం 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమార రామగోపాలరాజాబహుదూర్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లోవలో పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ



తుని రూరల్, ఏప్రిల్15: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో తలుపులమ్మ అమ్మవారి పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ ఇమని నాగ వెంకట కృష్ణ, ఇజమూరి రామంతో పాటుగా ఇతర పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పంచలోహ విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి లోవ దేవస్థానం పరిసర గ్రామాల భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ పెన్మచ్చ విశ్వనాథ రాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సరుకుతో పాటు వ్యాన్ దగ్ధం



మండపేట, ఏప్రిల్ 15: మండపేట మండలం ఇప్పనపాడు వద్ద రోడ్డుపై విద్యుత్‌లైన్లను తాకడంతో తాపేశ్వరం నుంచి పరుపులు తయారీ కోసం వినియోగించే ఫోమ్ ముడి సరుకును తీసుకువెళ్తున్న వ్యాన్ సరుకుతో సహా కాలిబూడిదైంది. ద్వారపూడి వైపు వెళ్తున్న లోడ్ వ్యాను ఇప్పనపాడు వద్ద ఉన్న రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. విషయాన్ని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యాన్‌ను రోడ్డు మీద నుంచి ఊరు బయట ఖాళీ ప్రదేశానికి తరలించే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు మంటలు వ్యాపించటంతో ఇప్పనపాడు శివారు రిలయన్ కాలనీ వద్ద వదిలేసి డ్రైవర్ బయట పడ్డారు. అనపర్తి, మండపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ముడిసరుకు, వ్యాన్ విలువ సుమారు రూ.23 లక్షలు మేర ఉంటుందని అధికారులు శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

సరిహద్దుల్లో తనిఖీలు



మోతుగూడెం, ఏప్రిల్15: మావోయిస్టుల పార్టీ వారోత్సవాలు, ఎన్నికలు నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మోతుగూడెం తూలుకొండ కొత్తపల్లి గూడూరు దెబ్బగూడెం లక్కవరం ప్రధాన రహదారుల్లో సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కూంబింగ్ నిర్వహించారు. మావోయిస్టుల వారోత్సవాల కారణంగా భద్రాచలం, విశాఖపట్నం, బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈనెల 13 నుంచి 16 వరకు ఈ సర్వీసులను నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 17న పునరుద్ధరిస్తామని ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

భద్రంగా ఈవీఎంలు



స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఏప్రిల్ 15: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలురు వసతి గృహంలో పాడేరు నుంచి రెండు కంటైనర్లలో రంపచోడవరం వచ్చిన ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరిచారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 518 ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు భద్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, డీటీలు ఎస్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, చైతన్య శ్రీధర్, విశ్వనాథం, శివ, సీఐ వి.వెంకటేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, సీహెచ్.సంతోష్‌కుమార్, కృష్ణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణరావు, ఇందిరాబాయ్, పాల్‌బాబు, వీఆర్వోలు గణపతి, ఆనంద్ పాల్గొన్నారు.

శివాలయంలో నవగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఏప్రిల్ 15: స్థానిక శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో మిర్తివాడ కృష్ణారెడ్డి, కరుణశ్రీ దంపతుల సహాయంతో సోమవారం నవగ్రహ ప్రతిష్ఠ జరిపించినట్లు ధర్మప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు. ఆలయ ప్రధాన రుత్వికులు మల్లాది కిరణ్‌కుమార్, శివశర్మ, సాయిశర్మ, గణేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పంజర్ల నాగవీరభద్రరావు, ప్రభ, రామోజీ నాగారాణి, శ్రీనివాసరావు, బాలనాగు పావని, లీలానాగగుప్తా పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లాల లచ్చిరెడ్డి



రంపచోడవరం, ఏప్రిల్ 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లాల లచ్చిరెడ్డిని ఆ పార్టీ ఖరారు చేసింది. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ తనకు గిరిజన ప్రాంత ప్రజల సమస్యలపై అవగాహన ఉందని అన్నారు. భూపతిపాలెం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై పోరాడానని, ఏజెన్సీ మండలాల్లో గిరిజనేతరుల సాగులో ఉన్న భూముపై పోరాటం చేసి పేద గిరిజనులకు చెందేలా కృషి చేసినట్లు చెప్పారు. ఏజెన్సీలో పీసా, అటవీ హక్కులు, 1/70 తదితర చట్టాలు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు, జీవో నెంబరు3ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు.

వాహనాల తనిఖీలు



దేవీపట్నం, ఏప్రిల్ 15: దేవీపట్నం పరసనపాడు కాలనీ వద్ద సోమవారం ఎస్ఐ కేవీ నాగార్జున ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు ఆటోలు, ద్విచక్ర వాహనాలకు చలానాలు విధించారు. అధిక మంది కూలీలతో వెళ్తున్న ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించాలని ఎస్ఐ నాగార్జున వివరించారు.

'కోడి కత్తి డ్రామాకు సీక్వెల్ ఇది'

దేవీపట్నం, ఏప్రిల్ 15: కోడికత్తి డ్రామా మాదిరిగానే సీఎం జగన్‌పై గులకరాయి దాడి జరిగిందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు జెఎస్ నగేష్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గులకరాయి దాడి నెపంతో ప్రజల్ని మభ్య పెట్టాలనుకున్నారని, కాలం చెల్లిన డ్రామాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కొత్త వెర్షన్‌లో కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఎన్ని నాటకాలు ఆడిన వైసీపీని ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని నగేష్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలి

వై.రామవరం, ఏప్రిల్ 15: రంపచోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థిని గెలిపించుకుని పార్టీ విజయానికి కృషి చేద్దామని వై.రామవరం మండల టీడీపీ శ్రేణులు ముక్తకంఠంతో తెలిపాయి. సోమవారం మండలంలోని యార్లగడ్డలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ సమన్వయకర్త లీలాప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, సూపర్‌సిక్స్ పథకాలు, పింఛన్ రూ.4వేలు పెంపు, దివ్యాంగులకు రూ.6వేలు వంటి పథకాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని సమావేశంలో తీర్మానించారు. టీడీపీ సీనియర్ నాయకులు గొర్లె శ్రీకాంత్, ఎదుళ్ల లచ్చిరెడ్డి, అడబాల ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 15: శ్రీరామనవమి సందర్భంగా 58వ వార్షిక శ్రీరామనవమి సంగీతోత్సవాలు ఈ నెల 17నుంచి 21వరకు రాజమహేంద్రవరంలోని కుమారి టాకీసు వద్ద ఉన్న హిందూ సమాజంలో జరుగుతాయని శ్రీరామభక్త గానసభ కార్యవర్గ అధ్యక్షుడు న్యాపతి సుబ్బారావు తెలిపారు. ప్రతిరోజూ ప్రసిద్ధ సంగీత విద్వాంసులతో కచేరీలు నిర్వహిస్తారని, 28న హిందూ సమాజ ఆవరణలో పేదలకు అన్నదానం జరుగుతుందని చెప్పారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

» పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరగాలి

» పీవో, ఏపీవోలకు శిక్షణలో ఆర్డీవో చైత్రవర్షిణి



శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న ఆర్డీవో చైత్రవర్షిణి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 15: ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కేటాయించిన విధులను ఎంతో బాధ్యతగా నిర్వర్తించాలని రాజమహేంద్రవరం ఆర్డీవో, రాజానగరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి సూచించారు. సార్వత్రిక ఎన్నికల విధులకు నియమించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు పీవో, ఏపీవోలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఆ మేరకు సంబంధిత మాస్టర్ ట్రైనీల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది ప్రతీఒక్కరూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ముందు రోజున, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత రోజున చేయాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్‌ల ద్వారా సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని ఆర్డీవో కోరారు. తొలుత పీవోలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అందజేసే మెటీరియల్‌ను చెక్ లిస్ట్ ప్రకారం సరిచూసుకోవాలన్నారు. ఓటింగ్ పూర్తయిన తరువాత రిసెప్షన్ కేంద్రాలకు అందజేసే వరకూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఓటరు ఓటుహక్కు వినియోగించడంపై ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. తద్వారా పోలింగ్‌ను సమర్థవంతంగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. శిక్షణా తరగతుల నిర్వహణ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో డెమో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎం, వీవీ ప్యాడ్ పనితీరు, నిర్వహణ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రదర్శనద్వారా వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని సహాయరిటర్నింగ్ అధికార్లు, ఎఎల్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహించొద్దు

అనపర్తి, ఏప్రిల్ 15: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని, అలసత్వం వహించవద్దని, బాధ్యతతో వ్యవహరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారిణ ఎం.మాధురి అన్నారు. సోమవారం అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా నిర్వహించేందుకు సిబ్బంది అవగాహన పెంచుకోవాలని, పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ ముందు, తరువాత చేపట్టాల్సిన బాధ్యతలపై శిక్షణ పొందిన ట్రైనర్లు అధికారులకు శిక్షణను అందించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

రేపు రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 15: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు శ్రీరామ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిపై గతంలో నుంచి భౌతికంగా దాడులు జరుగుతూనే ఉన్నాయని ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలో నైతిక విలువలను పెంపొందించేందుకు శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమితి ఉపాధ్యక్షుడు గండేపూడి సురేష్ మాట్లాడుతూ ఈ ర్యాలీకి భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి ఆశీస్సులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో బండ్ల రామశంకర్, కర్రి శ్రీనివాస్, తాడేజు హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజానగరం, ఏప్రిల్ 15: మండలంలోని చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, లక్ష్మీ, సరస్వతి, వినాయక ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం కన్నుల పండువుగా జరిగింది. దీనిలో భాగంగా మూడు రోజులుగా అమ్మవారితో పాటు ప్రతిష్ఠ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన గాది సూరిబాబు దంపతులు ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులతోపాటు ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో... నరేంద్రపురంలో శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి నూతన ఆలయ, శిలా విగ్రహ, పంచలోహ ఉత్సవమూర్తుల ధ్వజస్తంభ, గరుడ, శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పాల్గొని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి దర్శించుకున్నారు.

వైసీపీపై విశ్వాసం సన్నగిల్లడంతోనే వలసలు

» టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

» అధికార పార్టీ నుంచి 500 మంది టీడీపీలోకి చేరిక

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: వైసీపీ పట్ల విశ్వాసం సన్నగిల్లడంతోనే ఆ పార్టీ నుంచి టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 6, 31 డివిజన్లకు చెందిన సుమారు 500 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆదిరెడ్డి వాసుతోపాటు జనసేన ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ, మజ్జి రాంబాబు, జావి సత్యనారాయణ హాజరయ్యారు. వైసీపీ నాయకుడు అవాల గాంధీతోపాటు ఆయన ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన సయ్యద్ అలీమ్, సుంకర చిన్న, కంది సూర్యప్రకాష్, చిన్నకోటి, పెద్దకోటి సర్కిల్, కిషోర్, బాబీ, శేఖర్, రాంబాబు, తేజా, గౌతమ్, అరవింద్ సహా 500 మందిని పార్టీ కండువాలతో ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీని వీడిన కొంతమంది టీడీపీలోకి చేరకపోయినా తనకు మద్దతును ప్రకటించారని ఇది చాలా శుభపరిణామమన్నారు. పార్టీలకు అతీతంగా తమను సమర్థిస్తున్న వారందరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. టీడీపీ-బీజేపీ-జనసేన కలయిక రాష్ట్ర భవిష్యత్తు కోసమేనన్న సంగతి ప్రజలు గుర్తించాలన్నారు. వేలాది మంది టీడీపీలోకి చేరుతుంటే రాజమహేంద్రవరం రీల్స్ స్టార్, ఆయన భజన స్టార్లు తప్పితే ఆ పార్టీలో ఇంకెవరు మిగలరన్న విషయం చాలా స్పష్టంగా తెలుస్తోందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీ నాయకత్వాలను బలపరిచే విధంగా ప్రతిఒక్కరు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి అధికారం కోసం అందరం కలిసి కట్టుగా అహర్నిశలు కృషి చేయాలన్నారు. తొలుత టీడీపీలోకి చేరికలు సందర్భంగా భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, చింతా జోగినాయుడు, ఆసూరి సుధాకర్, మజ్జి మణికంఠ, వీరా రాము, పోలాకి పరమేష్, కిలపర్తి నాగభూషణం, శనపతి సత్తిబాబు పాల్గొన్నారు.





వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

నేను చెప్పిందే చేస్తా..

తాను ప్రజలకు ఏదైతే చెబుతున్నానో అదే చేసి చూపిస్తానని, రాజమహేంద్రవరం ప్రజలు ఆరోగ్యంగా, భద్రతతో సుఖంగా ఉండడం, అభివృద్ధి చెందడం తనకు ముఖ్యమని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 3వడివిజన్‌లో సోమవారం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్, కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబులు మాజీ కార్పొరేటర్ బొమ్మనమైన శ్రీనివాస్, జక్కపూడి అర్జున్ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో వాసు మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను, తాను రూపొందించిన ఐదు అంశాల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ తాను రాజమహేంద్రవరాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తానని, ఎంపీ భరత్‌రామ్‌లా సుందరీకరణ పేరుతో అభివృద్ధి చేశానని ప్రజలను మోసం చేయనన్నారు. అభివృద్ధి అంటే శాశ్వతంగా నిలిచి వుండాలే తప్ప గాలికి కొట్టుకుపోయేలా వుండకూడదన్నారు. అస్సలు అభివృద్ధి అంటే ఎమిటో తెలిమని భరత్‌రామ్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వైసీపీకి గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చామకూర

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: తూర్పుగోదావరి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చామకూర శ్రీనివాసరావు ఎంపికయ్యారు. సోమవారం గోదావరి రుచులు హోటల్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్నిక జరిగింది. 2024-28 ఏడాది కాలానికి నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గౌరవ అతిథులుగా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కె.పద్మనాభం, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్‌రావు, అడ్డూరి రమణ, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ డీన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా చామకూర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా డీవీవీ సత్యనారాయణ, కోశాధికారిగా శివాజీరాజ్, ఉపాధ్యక్షుడిగా అడ్డూరి రమణ, సంయుక్త కార్యదర్శిగా డి.పాండు రంగ విటల్, కార్యనిర్వాహక కార్యదర్శి గా డి వినయ్ సాయికుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చామకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ పవర్ లిఫ్టింట్ అోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఒరుఖ గురుతరమైనబాధ్యతగా బావిస్తున్నానని చెప్పారు. పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించేలా అసోసియేషన్ ద్వారా కృషి చేస్తామన్నారు.

జగన్.. కోడికత్తి 2.0 డ్రామా

» టీడీపీ-జనసేన-బీజేపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 15: గత ఎన్నికలకు ముందు కోడికత్తి-1తో ప్రజల్లో సానుభూతి సంపాదించుకున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. రాబోయే ఎన్నికల కోసం కోడికత్తి 2.0 డ్రామాకు తెరలేపి దొడ్డిదారిలో మరోమారు సీఎం పీఠం దక్కించుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఎద్దేవా చేశారు. మండలంలోని తంటికొండలో వేంకటేశ్వరస్వామిని సోమవారం ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌పై దాడి నిజమైనదైతే దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కానీ తగిలిన గాయాన్ని సోషల్ మీడియాలో వస్తున్న వీడియోను చూస్తుంటే దండ వేసేటపుడు తగిలిన గాయంగా కనిపిస్తుందన్నారు. సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకోవడం వల్లే కొత్తకొత్త సినిమాలు చూపిస్తున్నారని, అయితే ప్రజలు ఆదరించే స్థితిలో లేరని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని నెహ్రూ ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మండలం తిరుమలాయపాలెం నుంచి ఆయన చైతన్య రథంపై రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వీధి వీధిన తిరుగుతూ సైకిల్, గాజుగ్లాసులపై ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. మొదటిరోజు తిరుమలాయపాలెం నుంచి గంగంపాలెం, ఠాకూరుపాలెం వరకు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తంటికొండ, తిరుమలాయపాలెం గ్రామాలకు పలువురు వైసీపీ నాయకులు నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. తంటికొండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బదిరెడ్డి బాబి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు తెలుగుదేశంలో చేరారు.



గోకవరం: తంటికొండలో టీడీపీలో చేరిన వారితో నెహ్రూ

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఏప్రిల్ 15: మండలంలోని ఊలపల్లిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రచారం నిర్వహించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని, కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేకు సైకిల్, ఎంపీకి కమలం గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామవరం-బిక్కవోలు మహాలక్ష్మి పాదయాత్ర

అనపర్తి, ఏప్రిల్ 15: బిక్కవోలు లక్ష్మీగణపతి భక్తుల కోరిన కోర్కెలు తీర్చే దైవమని, అందుకే అనపర్తి అసెంబ్లీ టికెట్ తిరిగి టీడీపీకి దక్కే విధంగా ఆశీర్వదించారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ టికెట్ కోల్పోయిన విషయం విధితమే. సదరు టికెట్‌ను సీటును ఈ క్రమంలో అనపర్తి టికెట్ తిరిగి టీడీపీకి కేటాయిస్తే కాలినడకన రామవరం నుంచి బిక్కవోలు వచ్చి లక్ష్మీగణపతిని దర్శించుకుంటానని నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి మొక్కుకున్నారు. టికెట్ మార్పుపై మూడు పార్టీల అధినేతలు సమావేశమై అనపర్తిని టీడీపీకి కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడంతో సోమవారం మహాలక్ష్మి తన మొక్కును చెల్లించుకున్నారు. స్వామికి 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నల్లమిల్లి మాతృమూర్తి సత్యవతి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె సనాతని, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కు చెల్లించుకునేందుకు లక్ష్మీగణపతి ఆలయానికి చేరుకున్న మహాలక్ష్మితో నల్లమిల్లి కుటుంబం

టీడీపీతో యువతకు మంచి భవిష్యత్

కవలగొయ్యిలో 200 మంది యువకులు చేరికలో గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 15: తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యమిస్తున్నట్టు రాజమహేంద్రవరం రూరల్ నియోజకర్గం కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని కలవలగొయ్యిలో గ్రామకమిటీ అధ్యక్షుడు మట్ట శ్రీను, దళితవాడకు చెందిన పల్లేటి ఏసు రత్నం, సీహెచ్ అనీల్ ఆధ్వర్యంలో 200 మంది యువకులు టీడీపీలో చేరారు. వీరికి గోరంట్ల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఐదేళ్ళుగా జగన్ ప్రభుత్వం యువతను మోసంచేసిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, మత్సేటి ప్రసాద్, బొప్పన నాగేశ్వరరావు, ముప్పిడి రాంబాబు, రేలంగి నారాయణరావు, కోరాడ సతీష్ పాల్గొన్నారు.


మాదిగలకు జగన్ ద్రోహం

ఆదిరెడ్డిని అసెంబ్లీకి పంపిస్తాం.. భరత్‌రామ్ ఇంటికే

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వైరాల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: మాదిగ జాతికి సీఎం జగన్ ద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వైరాల అప్పారావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నాయకుడు మందాకృష్ణ మాదిగ పిలుపుమేరకు రాష్ట్రంలో కూటమి అభ్యర్థుల విజయానికి తాము కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరంలో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుని అసెంబ్లీకి పంపిస్తామన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి విజయానికి కృషి చేస్తామన్నారు. వైఎస్ జగన్ ఎంపీగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా స్పందించి సీఎం అయ్యాక మాట తప్పాడన్నారు. జగన్ మాదిగలను మోసం చేశాడన్నారు.నగరంలో ఉన్న 13 మాదిగ పేటలకు సంబంధించి మాదిగ నాయకులను ఒక చోట కూర్చోపెట్టి ఒరుఖ బీసీ నాయకుడు తమకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారని అయితే తమకున్న కమ్యూటిని హాలు సచివాలయానికి అప్పగించేశారన్నారు.

ముగిసిన శ్రీ సత్తెమ్మతల్లి జాతర



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15: స్థానిక నారాయణపురం దేవస్థానాల వీధిలోని శ్రీ సత్తెమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజున ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. అమ్మవారి చీరలు వేలం వేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను దొడ్డా పద్మనాభం, ఆకేటి ఆదివిష్ణుమూర్తి, మానే దొరబాబు, దొడ్డా నరసింహమూర్తి, మానే ఆదిబాబు, వీరా శ్రీ కృష్ణభగవాన్, కోలా వీరభద్రరావు తదితరులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రియల్ 15: ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన యర్రంశెట్టి కొండలరావు ఎన్నికయ్యారు. ఈమేరకు సోమవారం జరిగిన రిటైర్డు ఎంప్లాయీస్ మహాసభలో కొండలరావును ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఆర్ ఆంజనేయులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.నరసింహరావు పాల్గొన్నారు.

బలభద్రపురంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బిక్కవోలు, ఏప్రిల్ 15: బలభద్రపురంలో కెనాల్ గట్టున తుప్పల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం కనుగొన్నామని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిందని, ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉందని, ఒంటిపై చొక్కా లేదని, ప్యాంట్ మాత్రమే వుందని, కుడి చేతికి ఎరుపు తాడు వుందన్నారు. వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్లు ఉండొచ్చన్నారు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామని, మృతుడి వివరాలు తెలిసిన వారు బిక్కవోలు పోలీస్‌స్టేషన్ 08857 236433, 94409 04851కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

జేగురుపాడులో అగ్ని ప్రమాదం

కడియం, ఏప్రిల్ 15: జేగురుపాడు బీసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు, ఓ పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మంగళగిరి శ్రీను, వడ్డాది లక్ష్మిలకు చెందిన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. దీంతో రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అలాగే బుడ్డిగ గోవిందుకు చెందిన పశువుల పాక కాలిపోయింది. దీంతో రెండు గేదెలు చనిపోగా ఒక ఆవుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకుని మంత్రి చెల్లుబోయిన వేణు, సర్పంచ్ యాదల స్టాలిన్, డాక్టర్ అనుసూరి పద్మలత జేగురుపాడు వెళ్లి బాధిత కుటుంబాలతో మాట్లాడారు.

కడియంలో ఇంటింటా రామాయణం

కడియం, ఏప్రిల్ 15: కడియంలోని మేకలదిబ్బ సెంటర్‌లో శ్రీరామకృష్ణుల ఆలయం వద్ద ఇంటింటా రామాయణం కార్యక్రమం సోమవారం జరిగింది. సేకరణ-వితరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తణుకుకు చెందిన ఆనోళ్ళ రామంచే నిర్వహించారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి : కలెక్టర్

మామా అల్లుళ్ల సవాల్!



పెండ్యాల అచ్చిబాబు.. (ఇన్‌సెట్లో) కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు







రాజీవ్‌కృష్ణ సెన్నార్ .. (ఇన్‌సెట్లో) వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు

- కొవ్వూరులో ప్రధాన అభ్యర్థులు ముప్పిడి, తలారి..
- కానీ అచ్చిబాబు, రాజీవ్ కృష్ణ మధ్యే అసలు పోరు
- వైసీపీలో వర్గపోరుతో పరిస్థితి అంతా అస్తవ్యస్తం
- అందుకే వనిత మార్పు.. అయినా ఆ పార్టీది ఎదురీతే

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

కొవ్వూరు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు ఆసక్తికరంగానూ, రసవత్తరంగా మారాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ నుంచి ప్రధాన అభ్యర్థులు పోరు ఎలా ఉన్నప్పటికీ ఇక్కడ కింగ్‌మేకర్లుగా ఉన్న వరసకు మామా అల్లుళ్లు పెండ్యాల అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణ మధ్యే పోటీ అన్నట్టు కనిపిస్తోంది. నిజానికి ఇక్కడ పోటీ ఎప్పుడూ రసవత్తరమే. 1952లో ఏర్పడిన నియోజకవర్గం ఇది. అప్పట్లో జనరల్ స్థానంగా ఉండేది. తర్వాత నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఇది ఎస్సీ రిజర్వుడు స్థానమైంది. 2009 నుంచి ఇది ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఎన్నికలు జరుగుతున్నాయి. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పారిశ్రామికవేత్తలైన పెండ్యాల వెంకట కృష్ణబాబు కుటుంబమే ఈ ప్రాంతంలో రాజకీయం చేస్తుండేది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొవ్వూరు సహా కొన్ని నియోజకవర్గాల్లో కృష్ణబాబు, ప్రఖ్యాత పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, మాజీ కేంద్రమంత్రి బోళ్ల బులిరామయ్య ప్రభావం ఉండేది. వీరిదంతా ఒకే కుటుంబం. బంధువర్గం. తెలుగుదేశం ఏర్పడిన తర్వాత 1983 నుంచి 2019 వరకూ జరిగిన 9 ఎన్నికల్లో ఏడుసార్లు తెలుగుదేశం పార్టీనే గెలిచింది. 1983, 85,89, 94, 2004లో ఎమ్మెల్యేగా పెండ్యాల కృష్ణబాబు గెలిచారు. 1999లో ఒక్కసారే ఆయన ఓడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి జీఎస్ రావు గెలిచారు. 2009లో ఎస్సీ నియోజకవర్గంగా ఎన్నికలు జరగడంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కృష్ణబాబు సహకారంతో టీవీ రామారావు గెలిచారు. 2014 ఎన్నికలు వచ్చేసరికి కృష్ణబాబు వైసీపీకి సపోర్టు చేశారు. దాంతో ఆయన సోదరుడు పెండ్యాల అచ్చిబాబు తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించడం మొదలుపెట్టారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కేఎస్ జవహర్ గెలిచారు. మంత్రి అయ్యారు. 2019లో అభ్యర్థి విషయంలో భిన్నాభిప్రాయాలు రావడంతో ఇతర ప్రాంతం నుంచి వచ్చిన టీడీపీ మహిళా నేత వంగలపూడి వనిత ఇక్కడ బరిలో నిలిచారు. వైసీపీ గాలివీయడంతో ఆ ఎన్నికల్లో ఆమె సుమారు 25 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. వాస్తవానికి ఈ నియోజకవర్గం టీడీపీ కంచుకోట.

ఇక్కడ కింగ్‌మేకర్లుగా ఉన్న కృష్ణబాబు, అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణలే ప్రధాన పార్టీల అభ్యర్థులకు వెన్నుదన్నుగా ఉంటారు. అయితే ఈ నియోజకవర్గంలో ప్రతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు మారిపోతూ ఉంటారు. దీనికి గెలిచిన ఎమ్మెల్యేకు, స్థానిక నేతల మధ్య వివిధ కారణాల రీత్యా అగాధం ఏర్పడడం షరా మామూలే అయింది. ఇక 2014 ఎన్నికల తర్వాత కృష్ణబాబు రాజకీయ జోక్యం తగ్గించారు. ఆయన ఆరోగ్య ఇతర కారణాల రీత్యా ఆయన క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన స్థానంలో వైసీపీని నడిపించే బాధ్యత రాజీవ్‌కృష్ణ చేతికి వచ్చింది. 2014లో రాజీవ్‌కృష్ణ నిడదవోలు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి అప్పట్లో టీడీపీ హవా అధికంగా ఉండడం వల్ల టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు చేతిలో ఓడిపోయారు. తర్వాత ఆయన కొవ్వూరుకే పరిమితమై ఇక్కడ అభ్యర్థిని గెలిపించడం కోసం పనిచేస్తున్నారు. 2019లో తానేటి వనిత విజయం వెనుక రాజీవ్ సహకారం ఉంది. అదే సమయంలో టీడీపీ అభ్యర్థి బాధ్యత అచ్చిబాబు తీసుకున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. వైసీపీ అభ్యర్థిగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పోటీ చేస్తున్నారు. వీరు గోపాలపురంలో ఒకరిపై ఒకరు 2014, 2019లో పోటీపడి, 2014లో ముప్పిడి, 2019లో తలారి గెలిచారు. ఇద్దరూ ఈ ఎన్నికల్లో కొవ్వూరులో మూడోసారి తలపడుతున్నారు. వాస్తవానికి ఈ పోటీ ఈ ఇద్దరి మధ్య కాకుండా అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణ మధ్య పోటీగా మారింది. అచ్చిబాబు అన్న కృష్ణబాబు అల్లుడే రాజీవ్‌కృష్ణ. అంటే అచ్చిబాబుకు అల్లుడు వరస రాజీవ్ కృష్ణ సెన్నార్ ఈ నేపథ్యంలో ఇక్కడ కొవ్వూరు ఎన్నిక మామా అల్లుళ్ల సవాల్‌గా మారింది. 2019 ఎన్నికల్లో అల్లుడిదే పైచేయి అయింది. ఈసారి మామ అచ్చిబాబు పైచేయి సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈసారి వైసీపీకి ఎదురీతే..

వాస్తవానికి టీడీపీకి ఈ నియోజకవర్గం కంచుకోట. 2019 ఎన్నికలకు వచ్చే నెల 13న జరగబోయే ఎన్నికలకు తేడా ఉంది. ఇవాళ అధికారి వైసీపీ మీద తీవ్ర వ్యతిరేకత ఉంది. అంతేకాక ఇక్కడ గెలిచి హోంమంత్రి అయిన తానేటి వనిత ఇక్కడ దళిత వర్గాలకు వ్యతిరేకంగా వ్యవహరించడమే కాకుండా ముఖ్యవర్గానికి వ్యతిరేకంగా గ్రామాల్లో చిచ్చుపెట్టారనే విషయం తీవ్ర నష్టాన్ని తెచ్చింది. ఒక వర్గానికి చెందిన ఇద్దరు ముగ్గురు మాటలు విని ప్రధాన వర్గాన్ని దూరం చేసుకున్నారనే వాదన కూడా ఉంది. అంతేకాక ఆమెను అభ్యర్థిగా తెచ్చుకుని గెలిపించిన రాజీవ్‌కృష్ణకు కూడా వ్యతిరేకంగా వ్యవహరించడం ఇక్కడ వైసీపీకి సమస్యగా మారింది. అందుకే ఆమెను గోపాలపురం నియోజకవర్గానికి పంపించి అక్కడి ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఇక్కడ పోటీపెట్టారు. వనితను పక్క నియోజకవర్గానికి మార్చినప్పటికీ ఇక్కడ వర్గపోరు మాత్రం సర్దుమణగలేదు. అంతేకాక కొందరి మాటలు విని రాజీవ్‌కృష్ణను వేరే ప్రాంతానికి పరిశీలకుడిగా పంపించే ప్రయత్నం జరగడం, దాంతో ఆయన కొద్దిరోజులు సైలెంట్ అయ్యారు. తిరిగి వైసీపీ అధిష్ఠానం జరిగిన తప్పు తెలుసుకుని మళ్లీ ఆయనకు ఇక్కడ బాధ్యతలు అప్పగించింది. దాంతో ఆయన పార్టీ అభ్యర్థికి సంబంధించి ఎన్నికల సారథ్య బాధ్యతలను చేపట్టారు. కానీ ఇప్పటికే వైసీపీకి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఎంపీపీతోపాటు పలువురు నేతలు వైసీపీని వదిలి టీడీపీలో చేరారు. వైసీపీ అభ్యర్థి తలారి వెంక ట్రావు ఎన్నికల ప్రచారం సందర్భంగానూ పార్టీలో వర్గపోరు తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. జగన్ బస్సుయాత్ర, తలారి వెంకట్రావు నామినేషన్ దాఖలకు అవసరమైన ఏర్పాట్లకోసం చర్చించడానికి ఆదివారం సమావేశమైన సందర్భంలో వేదిక మీదకు ముఖ్యులను ఆహ్వానించే సమయంలో ఒకరు అడ్డుతగలడంతో కొట్టుకునే పరిస్థితి దాపురించింది. ఇలా పార్టీలో నెలకొన్న అనేక తలనొప్పులను సరిదిద్ది, ఎన్నికల ప్రణాళికను ముందుకు నడిపించే విషయంలో రాజీవ్‌కృష్ణ ఎంతవరకూ నెట్టుకొస్తారో చూడాలి. ఇక 2009లో టీడీపీ, కాంగ్రెస్, ప్రజారాజ్యం మధ్య త్రిముఖ పోటీ జరిగినప్పుడు కూడా ఇక్కడ టీడీపీ గెలిచింది. ఇవాళ టీడీపీ, జనసేన, బీజేపీ ఒకటిగా పోటీ చేస్తున్నాయి. పైగా ఎన్నడూ లేని విధంగా అచ్చిబాబు స్వయంగా గ్రామాల్లోకి కూడా వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈనేపథ్యంలో మే 13న ముప్పిడి వెంకటేశ్వరరావు, తలారి వెంకట్రావు మధ్య జరిగే ఎన్నిక అచ్చిబాబు, రాజీవ్‌కృష్ణ మధ్య మామా అల్లుళ్ల సవాల్‌గా మారింది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి

మూడో ఆర్థిక శక్తిగా భారత్ ఆవిష్కరించబడాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 : ప్రపంచంలో మూడవ ఆర్థికశక్తిగా భారత్ ఆవిష్కరించబడేలా బీజేపీ కేంద్ర నాయకత్వం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిందని, దీన్ని ప్రజల ముందుకు తీసుకెళతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని లోక్‌సభ ఎన్నికల కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రొడక్టివిటీ పెరగడం వల్లే ఆర్థిక పరిస్థితి 11వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరుకున్నామని అన్నారు. సహజంగా పార్టీలోని నాయకులు వేర్వేరు రంగాల్లోని వారితో మాట్లాడి ఎన్నికల మేనిఫెస్టో రూపొందిస్తారని, దీనికి భిన్నంగా ప్రజామోదమైన మేనిఫెస్టో విడుదల చేయడం జరిగిందన్నారు. మేనిఫెస్టోకు రాష్ట్రం నుంచి వచ్చిన సూచనలు కూడా కేంద్రానికి పంపించామని తెలిపారు. సురక్షిత భారత్, సమృద్ధి భారత్‌ను మేనిఫెస్టోలో ఆవిష్కరించే ప్రయత్నం చేశారన్నారు. సంకల్ప్ పత్ర అని పేరు పెట్టడం ద్వారా వాటిని అమలు చేసే ధృఢ సంకల్పంతో బీజేపీ ముందుకు వెళుతుందన్నారు. మేనిఫెస్టోను కింది వర్గాల వరకూ తీసుకెళ్లే సంస్థాగతమైన బలం బీజేపీకి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సమర్థవంతమైన నాయకత్వం కూడా ఉందన్నారు. మేనిఫెస్టోలో 24 రంగాలు, పది సామాజికపరమైన అంశాలు ఉన్నాయన్నారు. ఈ పది వర్గాలకు సంక్షేమం అందించడం జరుగుతుందన్నారు. మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి దక్కుతాయని ఆమె స్పష్టంచేశారు. రాష్ట్రంలో స్మార్ట్ సిటీల కోసం కేంద్రం నిధులు ఇస్తున్నా, వాటిని రాష్ట్రం వినియోగించుకోవడంలో విఫలమైందన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.



డమ్మీ తలకట్టు, ముఖానికి ప్లాస్టర్లతో సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల

జగన్‌రెడ్డి నాటకాలు ప్రజలు నమ్మరు

ఓటమి భయంతోనే గులకరాయి దాడి చేయించుకున్న జగన్

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ/ రూరల్, ఏప్రిల్15: ప్రజలను ఇంకా మోసం చేయాలని జగన్‌రెడ్డి చేసే సానుభూతి ప్రయత్నాలు నమ్మే పరిస్థితి లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో తన అభిమానితో కోడికత్తి దాడి డ్రామాలు ఆడిన జగన్ సానుభూతి పొందాడన్నారు. ఈ ఐదేళ్లకాలంలో అసమర్థపాలనతో ప్రజల ఛీత్కారం ఎదుర్కొంటున్న జగన్ మళ్లీ సింపతి కోసం ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. వైసీపీ బస్సు యాత్రలో ఆ పార్టీ సామాజిక మాధ్యమాల విభాగాన్ని నడిపించే వారిలో ఒకరైన శ్రీధర్‌రెడ్డి నాలుగురోజుల కిందటే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తీవ్రమైన సంఘటనలు జరగొచ్చని పోస్టు చేశారని, దాని అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఈ జగన్నాటకమన్నారు. జగన్‌కు ఎవరు సలహా ఇస్తున్నారోకానీ అవి పనికిరానివన్నారు. జగన్‌పై దాడి జరిగినప్పుడు పోలీసులు గాడిదలు కాస్తున్నారా అని ప్రశ్నించారు. డీజీపీని వెంటనే సస్పెండ్ చేయకుండా ప్రభుత్వం ఎందుకు ఆగిందన్నారు. సంక్షేమం ముసుగులో జగన్ రాష్ట్రాన్ని దోచేశాడన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు లేవన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు కేంద్రంగా రాష్ట్రాన్ని జగన్ మార్చేశాడన్నారు. రాబోయే తరాలను తాకట్టుపెట్టే అధికారం జగన్‌కు ఎవరిచ్చారని, ఈ అప్పులు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. రాక్షసుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడని కనుక ప్రతిపక్షాలు అన్నీ ఏకమయ్యాయని, నాశనమైన రాష్ట్రాన్ని భారీ మరమ్మతులు చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. జగన్ కుట్రలు చేసినా సింపతి కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు అతన్ని నమ్మరని, కూటమి భారీ విజయాన్ని కైవసం చేసుకుని అధికారంలోకి రాబోతోందని చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, రూరల్ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, రూరల్ బీసీ సెల్ అధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు, పల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీట్ ఫైల్ చేసే విషయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిల్/జామీనుల విషయంలో ఖైదీల సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం మే 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్సైజ్ కేసులు పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు

ఇండియా కూటమితోనే రాజ్యాంగ పరిరక్షణ, ప్రత్యేక హోదా సాధ్యం

ఆత్మీయ సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావడం ద్వారానే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకున్న వాళ్లమవుతామని కూటమి నేతలు సీపీఐ రాష్ట్రకార్యదర్శి కే రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజులు స్పష్టంచేశారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి టీ అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి మధు అధ్యక్షతన జరిగిన కూటమి ఆత్మీయ సమావేశంలో వారు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, కొవ్వూరు అభ్యర్థిని అరిగెల అరుణకుమారి, గోపాలపురం అభ్యర్థి మార్టిన్ లూథర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీలకు కట్టబెడుతుందన్నారు. రైతుల రుణమాఫీకి ఆర్థిక వ్యవస్థ బాగోలేదని చెప్పి కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వేల కోట్లు రుణాలను మాఫీ చేస్తోందన్నారు. బీజేపీని వ్యతిరేకించే సీఎంలను సైతం జైళ్లలో నిర్బంధిస్తుందన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తామని చెప్పిన జగన్ మాట తప్పాడన్నారు. ఏపీకి న్యాయం జరగాలంటే ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని.. అది ఇండియా కూటమి వల్లనే సాధ్యమవుతుందన్నారు. దేశాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం వారంతా ఐక్యత చాటారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాజమహేంద్రవరం అభ్యర్థి బోడా వెంకట్ ప్రచార రథాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత డీవీవీఎస్ వర్మ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, సీపీఎం నగర కార్యదర్శి బి.రాజులోవ, బి.పవన్, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తులసి, జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మాజీ సైనికులు సేవలు అందించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15: జిల్లాలో మే 13న జరిగే ఎన్నికల పోలింగ్ విధుల్లో మాజీ సైనికులు సేవలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే మాధవీలత కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో మాజీ సైనికుల అసోసియేషన్ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌కే మాధవీలత మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో సైనికుల సేవలు నిరుపమానం అన్నారు. పోలింగ్ సజావుగా సాగేందుకు మీవంతు సహకారం అందించాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కలగజేస్తామన్నారు. జిల్లా ఎస్పీతో సంప్రదించి మీ సేవలు ఎక్కడ అవసరమో తెలుసుకుని, ఆ మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మాజీ సైనికులు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 600 మంది మాజీ సైనికులు ఉన్నారని వారంతా సహకారాన్ని అందిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జీ నరసింహులు, జిల్లా మాజీ సైనికులు అసోసియేషన్ అధ్యక్షుడు జి ప్రసాదరావు, సెక్రటరీ జై చంద్రశేఖర్, కోశాధికారి, రాజేంద్రకుమార్, ఇతర మాజీ సైనికులు పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బంది శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే మాధవీలత - రాజమండ్రి

మైనారిటీలకూ ‘మొండిచేయి’

- ఇమామ్, మౌజన్‌ల జీతాలకు వక్ఫ్ సొమ్ములు
- ఆరు నెలలుగా భృతి మరిచిన ప్రభుత్వం
- గురువుల ఆవేదన చూడలేక అధికారుల చొరవ
- మైనారిటీలపై వైసీపీ ముందు నుంచీ చిన్నచూపే
- హజ్ రాయితీతో సహా పథకాలన్నీ తీసివేత

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

కుడి చేత్తో బటన్ నొక్కి.. ఎడమ చేత్తో ఆ సొమ్ములను లాగేసుకుంటూ ఐదేళ్లుగా హస్తలాఘవాన్ని చూపడంతోనే జగన్ పరిపాలనను సరిపెట్టారు. ఏ వర్గానికీ మేలు చేసిన దాఖలాలు లేవు. చివరికి.. నా మైనారిటీలంటూనే వాతలు పెట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేశారు. ముస్లిం గురువులకు జీతాలూ ఇవ్వకుండా పవిత్ర రంజాన్ మాసంలోనూ ఆవేదనకు గురిచేశారు. ఆరు నెలలుగా గురువుల ఆవేదన చూడలేక వక్ఫ్‌బోర్డు అధికారులు వేతనాలను విడుదల చేశారు. అదీ రంజాన్ ముగిసిన తర్వాత ఇవ్వడం గమనార్హం.

ప్రతి మసీదులో ఇమామ్, మౌజన్ ఉంటారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే తలంపుతో టీడీపీ ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ భృతిని ప్రవేశపెట్టింది. ఇమామ్‌కి రూ.5 వేలు, మౌజన్‌కి రూ.3 వేలు క్రమం తప్పకుండా గౌరవ భృతి అందేది. అయితే గత ఎన్నికల సందర్భంగా అలవికాని హామీలు వల్లెవేసిన జగన్.. ఇమామ్, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారు. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మరిచిపోయారు. నాలుగు ఏళ్లపాటు ముస్లింలు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఏడాది నుంచి ఇమామ్, మౌజన్‌లకు జీతాల పెంపు జరిగింది. అయితే ఆరు నెలల నుంచీ పెంచిన జీతాల మాట దేవుడెరుగు.. అసలు పైసా కూడా రాలేదు. రంజాన్ మాసంలోనూ గౌరవ భృతిని విడుదల చేయలేదు. దీంతో రంజాన్‌లో జిల్లాలోని 205 మసీదుల్లోని సుమారు 400 మంది ఇమామ్, మౌజన్లు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఆరు నెలల నుంచీ జీతాలు రాకపోవడంతో రంజాన్ వేళ అప్పుల కోసం తిప్పలు పడ్డారు. రంజాన్ మాసంలో మసీదులకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్న జగన్‌కి వారి కష్టాలు మాత్రం కనిపించలేదు. రంజాన్ ముగుస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదు. దీంతో గురువుల ఆవేదన చూడలేక సీఈవో, అధికారులు నిర్ణయం తీసుకొని వక్ఫ్ బోర్డు నుంచి జీతాలను చెల్లించారు. ఈనెల 11న రంజాన్ ముగియగా.. 12న వేతనాలను ఖాతాల్లో వేశారు. వక్ఫ్ బోర్డు చొరవ చూపకుంటే ప్రభుత్వం నుంచి పైసా వచ్చేది కాదంటూ గురువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ‘నా’ ‘నా’ అంటూనే నానాతంటాలూ పెట్టడం జగన్‌కి ఉన్న ప్రత్యేక లక్షణం. నా మైనారిటీలు అంటూనే అధికారంలోకి రాగానే వారికి అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేశారు. మసీదులు, శ్మశాన వాటికలు తదితర వాటి అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన వక్ఫ్‌బోర్డు నిధులనూ పాలకులు వాడుకున్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రకు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రాయితీలను కూడా రద్దు చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి రూ.60 వేలు, మిగతా వారికి రూ.30వేలు హజ్‌కి ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన జగన్ తర్వాత ఆ మాట మరిచారు. ముస్లింలు హజ్‌కి హైదరాబాద్‌లో విమానం ఎక్కేవారు. వైసీపీ ప్రచార యావతో విజయవాడ నుంచి విమానం అందుబాటులోకి తెచ్చింది. అయితే దీనివల్ల ఒక్కో యాత్రికుడిపై రూ.90వేల అదనపు భారం పడింది. ఒక్కపైసా కూడా ప్రభుత్వం భరించలేదు. టీడీపీ ప్రభుత్వంలో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులతో ఒక గైడ్‌ను పంపించేవారు. దీనికోసం మక్కా కనీసం ఓసారి వెళ్లిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేవారు. వైసీపీ పాలకులు గైడ్‌ల నియామకానికి ఎలాంటి ప్రక్రియ చేపట్టకుండా తమ కార్యకర్తలను నియమించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో గైడ్ అవకాశం కోసం ఎదురు చూస్తున్న విశ్రాంత ముస్లిం ఉద్యోగులు దగా పడ్డాయి. పేద, ధనిక అనే బేధం లేకుండా రంజాన్ ఆనందంగా జరుపుకోవాలని సంకల్పించి టీడీపీ ప్రభుత్వంలో రంజాన్ వచ్చిందంటే తోఫా పేరుతో కానుక అందజేసేవారు. తోఫాలో పప్పు, ఉప్పు, సేమియాలు, నెయ్యి పసుపు వంటి ఇఫ్తార్ వంటకు అవసరమైన వస్తువులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక తోఫాను తీసేసింది. దాని స్థానంలో ప్రత్యామ్నాయం కూడా ఏమీ అందజేసే ఆలోచన చేయలేదు. గత ప్రభుత్వంలో రంజాన్ మాసం రాక ముందే మసీదుల మరమ్మతులు, రంగులు, ఎలక్ట్రికల్ తదితర పనుల కోసం నిధులు విడుదల చేసేవాళ్లు. గ్రామాల్లోని మసీదులకు రూ.15వేలు, పట్టణాల్లోని మసీదులకు రూ.25వేలు అందజేసేవారు. వైసీపీ పాలన వచ్చిన వెంటనే ఆ ఆర్థిక సహాయానికీ నీళ్లొదిలేశారు. పెళ్లి కానుక అంటూ ‘దుల్హన్’ పథకాన్ని తెరపైకి తెచ్చారు. దాన్నీ నిర్వీర్యం చేసేశారు. 10శాతం మందికి కూడా లబ్ధి చేకూరలేదు. గత ప్రభుత్వంలో చిరు వ్యాపారులకు ఉపాధి కోసం రూ.1లక్ష సబ్సిడీతో రూ.3లక్షల రుణం అందజేసేవారు. దుకాణ్ మకాన్ అనే మంచి పథకం అమలు చేసేవాళ్లు. ఈ స్కీంలో ఇల్లు కట్టుకొని అక్కడే మటన్, చికెన్ తదితర దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాఫీగా సాగించడానికి 100శాతం సబ్సిడీతో రుణం అందేది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తత్కాల్ పథకం కింద వక్ఫ్‌బోర్డు నుంచి రూ.10వేలు ఇచ్చేవారు. వితంతువులకు రూ.10వేలు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేది. విదేశీ విద్యకు ముస్లిం మైనారిటీలకు రూ.15లక్షల సహాయం చేసేవారు. ఈ సొమ్మును రెండు వాయిదాల కింద ఇచ్చేవాళ్లు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటన్నిటినీ రద్దు చేసింది. పైగా ఈ ప్రభుత్వం చేసిన నిర్వాకంతో ముస్లిం విద్యార్థులు విదేశాల్లో ముప్పుతిప్పలుపడ్డారు. కొందరు చదువు మధ్యలో ఆపేసి భారత్‌కి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఏడాదిలో రెండో విడత జమ చేయాల్సిన నిధులను విద్యార్థులకు ఇవ్వకపోవడం ఆ దుస్థితికి దారితీసింది. ముస్లింల బరియల్ గ్రౌండ్స్‌కి ప్రహరీ తదితర మౌలిక సదుపాయాలకూ పైసా విదల్చలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆర్భాటంగా మైనారిటీ కార్పొరేషన్, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్, నూర్‌బాషా కార్పొరేషన్, సంచార ముస్లిం జాతుల కార్పొరేషన్‌లను ఏర్పాటుచేశారు. కానీ ఒక్క కార్పొరేషన్‌కీ నిధులు, విధులు లేవు. కుర్చీలు కూడా లేని దుర్భర స్థితిలో ఆ కార్యాలయాలున్నాయి.

● కబుర్లతో కాలక్షేపం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు కబుర్లతో కాలక్షేపం చేయడం ప్రజలకు అనుభవపూర్వకంగా బోధపడిన విషయమే. ముస్లింల విషయంలోనూ అదే జరిగింది. గత ప్రభుత్వం సమయంలో జిల్లాలో 205 మసీదులు, 410 మంది ఇమామ్, మౌజన్‌లు ఉండగా ఐదేళ్లుగా ఈ ప్రభుత్వంలో ఒక్క అంకె కూడా వాటికి జతకాలేదు. 150 మసీదుల్లోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ భృతి కల్పించలేదు. 2019లో రాజమహేంద్రవరంలోని రెహమత్‌నగర్‌లో రూ.90 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. అప్పటి ఎంపీ మురళీ మోహన్ తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు ఇవ్వగా.. ప్రభుత్వం రూ.65 లక్షలు సమకూర్చింది. టెండరు కూడా ఖరారు అయ్యింది. తర్వాత ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం అధికారం పీఠమెక్కడం తెలిసిందే. దీంతో రూ.65 లక్షల నిధులూ వెనక్కి తీసేసుకున్నారు. ఇప్పుడు షాదీఖానా నిర్మిస్తామంటూ వైసీపీ నేతలు చెబుతుండడంపై ముస్లింలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

ముస్లింల పథకాలన్నీ రద్దే

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ముస్లింల పథకాలన్నీ రద్దు చేశారు. జగన్ మళ్లీ గెలిస్తే మా గురువుల జీతాలనూ తీసేస్తారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా 6 నెలల నుంచీ ఇమామ్, మౌజన్‌లకు జీతాల్లేవు. వక్ఫ్ బోర్డు దయతలచి గురువులకు జీతాలు చెల్లించింది. ఈ పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలోనే చూశాం. జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఎలా చేస్తుంది. ఈ ప్రభుత్వ హయాంలో మైనారిటీల జీవితాలు దుర్భరంగా మారాయి.

- షేక్ సుభాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి



పసివేదలలో కూటమి శ్రేణులతో అభ్యర్థులు ముప్పిడి, పురందేశ్వరి

కొవ్వూరు, ఏప్రిల్ 15: రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దగల ఏన్డీఏ కూటమికి రెండు ఓట్లు వేసి గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు మండలం పశివేదలలో గారపాటి శ్రీనివాసరావు నివాసంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. అనంతరం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, కేంద్రంలో మోదీ అమలుచేసిన పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, పిల్లల భవిష్యత్‌ కోసం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా తనకు కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంపల్లి సింహాచలం, వేగి చిన్నా, గారపాటి రామచంద్రరావు, బేతిన నారాయణ, ఎంపీటీసీ కె.బాలకృష్ణ, జనసేన నాయకులు రేకమండ రమేష్, బోడసింగి రాంబాబు, బీజేపీ నాయకులు పరిమి రాధ, కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుమామిడిలో రూ.1.30 లక్షలు సీజ్

నిడదవోలు, ఏప్రిల్ 15: నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామ సమీపంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికార్లు తనిఖీలు నిర్వహించారు. త్యాజంపూడి నుంచి నిడదవోలు వైపు వస్తున్న కొమ్మిరెడ్డి శ్రీనివాస్ మోటారు సైకిల్ తనిఖీ చేయగా రూ.1.30 లక్షల నగదును గుర్తించి సీజ్ చేసినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సుజాత తెలిపారు.

కొవ్వూరులో రూ.78,000

కొవ్వూరు, ఏప్రిల్ 15: కొవ్వూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న వ్యానులో డ్రైవర్, రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన బొడ్డు భానుప్రకాష్ రూ.78,000 నగదును తరలిస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ టీము గుర్తించింది. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు.

తాళ్లపూడిలో రూ.61,500

తాళ్లపూడి, ఏప్రిల్ 16: తాళ్లపూడిలో గోదావరి గట్టు మీద మోదుగులమ్మ ఆలయం వద్ద జరిపిన తనిఖీల్లో జిన్నూరు మండలం వడ్లపాలెం గ్రామం గొల్లవాని చెరువు ప్రాంతానికి చెందిన గోల్ల శ్రీ పద్మకుమారి వద్ద ఆధారాలు లేని రూ.61,500 నగదును సీజ్ చేసినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురవయ్య తెలిపారు. నగదును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు.

నల్లజర్లలో రూ.1,48,560

నల్లజర్ల, ఏప్రిల్ 15: అనంతపల్లి టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్టు పోలీసులు తనిఖీ చేయగా వల్లభ పాల వ్యాన్‌లో రూ.65,560 నగదు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఏటువంటి బిల్లు లేకపోవడంతో సీజ్ చేశారు. అలాగే జంగారెడ్డిగూడెంకు చెందిన పిచ్చుకుల గౌతమ్ వద్ద రూ.83,000 నగదు ఉన్నట్టు గుర్తించి ఎటువంటి రశీదులు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

నిర్భయ్‌సింగ్‌ను విడుదల చేయాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ

కొవ్వూరు, ఏప్రిల్ 15: పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి నిరసన తెలిపినందుకు కీర్తి కిసాన్ యూనియన్ అధ్యక్షుడు నిర్భయ్‌సింగ్ అరెస్టు చేయడాన్ని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ఖండించారు. నిర్భయ్‌సింగ్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,19 ప్రకారం దేశంలోని ప్రతిపౌరుడు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చునన్నారు. తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రచారం చేయవచ్చు. ఓటింగ్‌లో పాల్గొనే అభ్యర్థుల్లో ఎవరినైనా లేదా అందరినీ తిరస్కరించే హక్కు ఉంది. ఎన్నికల సంఘం నోటా ఎంపికను ఆమోదించిందన్నారు. నిర్భయ్‌సింగ్, అతని సంస్థ కేకేయూ ఎటువంటి నేరం చేయలేదని, రాజ్యాంగ హక్కులపై బీజేపీ దాడిని వ్యతిరేకిస్తున్నామన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు



నిడదవోలు, ఏప్రిల్ 15: నిడదవోలు మండలం మునిపల్లిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమ సప్తమి సందర్భంగా సోమవారం సుమారు 600 తులసి మొక్కలతో ధాత్రి సహిత శ్రీ లక్ష్మీనారాయణస్వామి సహస్ర నామాలతో అష్టోత్తర కుంకుమ పూజలు నిర్వహించినట్టు ఆలయ వంశ పారంపర్య అర్చకులు రామకృష్ణమాచార్యులు, కృష్ణ ప్రసన్నమాచార్యులు తెలిపారు. పూజ అనంతరం తులసి మొక్కలను భక్తులకు పంపిణీ చేశారు.

రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

తాళ్ళపూడి, ఏప్రిల్ 16: రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యమని, తాము అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు రూ.8333 ప్రతి నెలా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారి తెలిపారు. మండలంలోని బల్లిపాడు గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గెడ్డం సాయిబాబా, కొణెదల శ్రీనివాస్, సాయిన సుబ్బారావు, గంధం బాబ్జి, మటాంట రవికుమార్, అరిగెల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24 మంది వలంటీర్లు రాజీనామా

నల్లజర్ల, ఏప్రిల్ 15: మండలంలోని జగన్నాథపురం,పుల్లలపాడు గ్రామాలకు చెందిన వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శులకు అందజేశారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన 9మంది, పుల్లలపాడులో 15మంది వలంటీర్లు రాజీనామా చేసి కార్యదర్శి కుమార్, రాజులపాటి శ్రీనివాస్‌కు రాజీనామా పత్రలు అందించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజానగరం, ఏప్రిల్ 15: మండలంలోని చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, లక్ష్మీ, సరస్వతి, వినాయక ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. దీనిలో భాగంగా మూడు రోజులుగా అమ్మవారితో పాటు ప్రతిష్ఠ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన గాది సూరిబాబు దంపతులు ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులతోపాటు ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో... నరేంద్రపురంలో శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి నూతన ఆలయ, శిలా విగ్రహ, పంచలోహ ఉత్సవమూర్తుల ధ్వజస్తంభ, గరుడ, శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పాల్గొని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి దర్శించుకున్నారు.

కడియంలో ఇంటింటా రామాయణం

కడియం, ఏప్రిల్ 15: స్థానిక మేకలదిబ్బ సెంటర్‌లో శ్రీరామకృష్ణుల ఆలయం వద్ద ఇంటింటా రామాయణం కార్యక్రమం జరిగింది. సేకరణ-వితరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తణుకుకు చెందిన ఆనోళ్ళ రామంచే నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సోమవారం కడియంలో భక్తులు గెద్దాడ సూరిబాబు, కడలి విజయదుర్గల సహకారంతో ఏర్పాటు చేశారు.

కోదండరాముడి విగ్రహ పునః ప్రతిష్ఠ

నల్లజర్ల, ఏప్రిల్ 15: మండలంలోని పోతవరం గ్రామంలో కోదండ రాముల విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం కోదండరాముని విగ్రహ పునః ప్రతిష్ఠ నిర్వహించారు. వేదపండితుల కృష్ణమూర్తి శర్మ, సతీష్‌శర్మ మంత్రోచ్చరణతో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రధాన మండప పూజ, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

- పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరగాలి
- పీవో, ఏపీవోలకు శిక్షణలో జిల్లా కలెక్టర్ మాధవీలత



కొవ్వూరులో శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు/నిడదవోలు/గోపాలపురం, ఏప్రిల్ 15: పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కొవ్వూరు మండలం దీప్తి పాఠశాలలో కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలోను, నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని వికాస్ కళాశాలలోను, గోపాలపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమంలోను సార్వత్రిక ఎన్నికల విధులకు ఎంపిక చేసిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈవీఎంలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది మాక్ పోలింగ్ ప్రక్రియ నుంచి పోలింగ్ ముగిసే వరకు జాగ్రత్తగా విధి నిర్వహణలో జవాబుదారితనం కలిగిఉండాలన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా జరిగేందుకు ఎన్నికల సిబ్బంది ముందుగా పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ ముందురోజు, పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం చేయవలసిన పనులపై మాస్టర్ ట్రైనర్‌లు సమగ్ర శిక్షణ అందజేస్తారన్నారు. సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామగ్రి చెక్‌లిస్టు ప్రకారం సరిచూసుకోవాలన్నారు. ఓటింగ్ పూర్తయి బ్యాలట్ బాక్సులు రిసెప్షన్ కేంద్రాలకు చేరేవరకు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్‌లు డెమో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌ల పనితీరు, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, పీవోలు, ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు. నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించి 464 మంది శిక్షణకు హాజరు కావలసి ఉండగా 19మంది అధికార్లు, సిబ్బంది గైర్హాజరయ్యారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఇంటర్ పరీక్షల్లో గోపాలపురం ఆశ్రమ పాఠశాల సీనియర్ ఎంపీసీలో కొరపాటి కృష్ణవేణి 966 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం, బైపీసీలో కరుటూరి సౌమ్య 964మార్కులతో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఇద్దరినీ కలెక్టర్ సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.రమణ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎమ్.భాను ప్రకాష్, గోపాలపురం రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం

- స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ
- ప్రజలు సమాచారం అందించాలి: సెబ్ అధికారి సోమశేఖర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారా తయారీ, రవాణా, విక్రయాలపై మరింత అప్రమత్తంగా ఉన్నామని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ స్పష్టం చేశారు. సోమవారం ఆమె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ-సెబ్) రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్‌ను పరిశీలించారు. సెబ్ జిల్లా అధికారి పి.సోమశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి అసిస్టెంట్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో పంపిణీ చేయడానికి మద్యం, సారా నిల్వ చేయడం, మాదకద్రవ్యాలు తదితర వాటిపై పటిష్టమైన నిఘాతో సమాచారం సేకరించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాశ్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను అనుసరించాలని సూచించారు. గోదాములు తదితర ప్రాంతాల్లోని పెద్ద మొత్తంలో మద్యం నిల్వలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. కాలిటీ, క్వాంటిటీ కేసులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, సారా, మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సెబ్ పోలీస్‌స్టేషన్‌కు ప్రజలు సమాచారం అందించాలని సెబ్ జిల్లా అధికారి సోమశేఖర్ సూచించారు. అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అక్రమ మద్యం, సారా, మాదక ద్రవ్యాల నిల్వ, రవాణా, విక్రయాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఉన్నతాధికారుల సూచనలతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డా. ఎన్.నిక్సన్, ఎస్‌ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



కొవ్వూరులో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌టీఎఫ్ ఏసీ విజయ

రామేశంపేట చెక్ పోస్ట్ తనిఖీ

రంగంపేట, ఏప్రిల్ 15: రంగంపేట ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో రామేశంపేట వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తనిఖీ చేశారు. ఎన్నికలు కోడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు చెక్‌పోస్టుల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మద్యం, నగదు, ఇతర బహుమతులు రవాణా జరగకుండా చూడాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఈబీ రంగంపేట సీఐ ఎస్.రాంబాబు, పెద్దాపురం సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ టి.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు ఎస్‌ఈబీ స్టేషన్ పరిశీలన

కొవ్వూరు, ఏప్రిల్ 15: కొవ్వూరు ఎన్ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్‌ను సోమవారం స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారా విక్రయాలు జరగకుండా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం రవాణాతోపాటు సారా తయారుచేసే ప్రాంతాలు, గ్రామాలు, లంకల్లో విస్తృతంగా దాడులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎన్.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమష్టిగా కృషి చేయాలి

- నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి శేషారావు



చాగల్లు టీడీపీలోని రెండు వర్గాలతో కలిసి ఉమ్మడి సమావేశంలో ముప్పిడి

పెరవలి, ఏప్రిల్ 15: గ్రామాల్లో బూత్ స్థాయిలో ఉండే కార్యకర్తలందరూ కష్టపడి పనిచేసి రాబోయే ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఉండ్రాజవరం మండలం బూత్ లెవిల్ కార్యకర్తలకూ కానూరులోనూ పెరవలి మండలం బూత్ స్థాయి కార్యకర్తలకు పెరవలి దీపికా ఫంక్షన్ హాలులోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఓటరు కార్యకర్తలకు తెలిసి ఉంటారని, వారితో తప్పనిసరిగా ఓటు వేయించాల్సిన బాధ్యత బూత్‌స్థాయి కార్యకర్తలదేనని, దీనికి అనుగుణంగా ఇప్పటి నుంచే కార్యరంగంలోకి ప్రవేశించాలన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ రాబోయే ఎన్నికల్లో అనేక అక్రమాలకు, అవకతవలకు పాల్పడే అవకాశం ఉన్నందున టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వారి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, టీడీపీ నాయకులు రామకృష్ణ, అతికాల రామకృష్ణమ్మ, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, పిప్పర రవి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక... మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరిలో కానూరు ఉపసర్పంచ్ అనపర్తి నరసింహరావు, కానూరు అగ్రహారం నాయకులు చినకాపు, హరిదాసు కాశీ విశ్వనాథం, గరగ సత్యనారాయణ, చెన్న పెద్దశ్రీను తదితరులున్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి: ముప్పిడి

చాగల్లు, ఏప్రిల్ 15: టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లులోని ఇందిరమ్మ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే పెన్షన్ రూ.4 వేలకు పెంచి ఇంటికే తీసుకొచ్చి అందజేస్తారన్నారు. కాలనీలో రోడ్లు, డ్రైన్లు సహా మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, దొంగ రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, జనసేన నాయకులు కొప్పాక విజయకుమార్, ఉప్పులూరి చిరంజీవి, బీజేపీ నాయకులు తాళ్ళూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, ముళ్ళపూడి రాము, కోడి శ్రీనివాసరావు, నందిగంపాడు నుండి పార్థసారధి, చిక్కాల నుండి అబ్బులు చౌదరి, పిల్లి శ్రీనివాసరావు తదితరులతో కలిసి మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి తదితరులు ఉమ్మడి సమావేశం నిర్వహించి చర్చలు జరిపారు. పార్టీ గెలుపునకు అందరం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో మండలంలోని టీడీపీలో విభేదాలు సమసిపోయినట్టు పార్టీ నాయకులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

దుర్గేష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలి

- టీడీపీ నిడదవోలు ఇన్‌చార్జి శేషారావు
- చివటం, కె.సావరంలో ఎన్నికల ప్రచారం



చివటంలో ప్రచారం నిర్వహిస్తున్న దుర్గేష్, శేషారావు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 14: నిడదవోలు నియోజకవర్గం నుంచి టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కందుల దుర్గేష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండలంలోని చివటం, కె.సావరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం వస్తుందని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రజలందరికి సంక్షేమ, అభివృద్ధి పథకాల మేనిఫెస్టో ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. దుర్గేష్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. చివటం, కె.సావరంలో ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కె.సావరంలో ప్రజలు డప్పులతో స్వాగతం పలుకుతూ నాయకులపై పూలవర్షం కురిపించారు. భారీ పూలదండను దుర్గేష్, శేషారావుకు వేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బీవీ ప్రసాద్, నార్ని రామకృష్ణ, కాకర్ల కరుణాకర్, టీడీపీ నాయకులు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, సింహాద్రి రామకృష్ణ, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, కుదప రమేష్, ముళ్లపూడి పాండురంగ, బీజేపీ నాయకులు బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బలభద్రపురంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బిక్కవోలు, ఏప్రిల్ 15: బలభద్రపురంలో కెనాల్ గట్టున తుప్పల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం కనుగొన్నామని ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిందని, ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉందని, ఒంటిపై ప్యాంట్ మాత్రమే వుందని, కుడి చేతికి ఎరుపు తాడు వుందన్నారు. వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్ల ఉండొచ్చన్నారు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామని, మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ తెలియజేయాలన్నారు.

జగన్.. కోడికత్తి 2.0 డ్రామా

జ్యోతుల నెహ్రూ..టీడీపీలో పలువురి చేరిక



గోకవరం, ఏప్రిల్ 15: గత ఎన్నికలకు ముందు కోడికత్తి-1తో ప్రజల్లో సానుభూతి సంపాదించుకున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. రాబోయే ఎన్నికల కోసం కోడికత్తి 2.0 డ్రామాకు తెరలేపి దొడ్డిదారిలో మరోమారు సీఎం పీఠం దక్కించుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఎద్దేవా చేశారు. మండలంలోని తంటికొండలో వేంకటేశ్వరస్వామిని సోమవారం ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌పై దాడి నిజమైనదైతే దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కానీ తగిలిన గాయాన్ని సోషల్ మీడియాలో వస్తున్న వీడియోను చూస్తుంటే దండ వేసేటపుడు తగిలిన గాయంగా కనిపిస్తుందన్నారు. సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకోవడం వల్లే కొత్తకొత్త సినిమాలు చూపిస్తున్నారని, అయితే ప్రజలు ఆదరించే స్థితిలో లేరని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని నెహ్రూ ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మండలం తిరుమలాయపాలెం నుంచి ఆయన చైతన్య రథంపై రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వీధి వీధిన తిరుగుతూ సైకిల్, గాజుగ్లాసులపై ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. మొదటిరోజు తిరుమలాయపాలెం నుంచి గంగంపాలెం, ఠాకూరుపాలెం వరకు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తంటికొండ, తిరుమలాయపాలెం గ్రామాలకు పలువురు వైసీపీ నాయకులు నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. తంటికొండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బదిరెడ్డి బాబి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు తెలుగుదేశంలో చేరారు.

మళ్లీ అమ్మాయే పుట్టిందా..?

- చిన్నారిని తుప్పల్లో పడేసిన తల్లి
- మగబిడ్డపై మమకారంతో నాలుగో సారి గర్భం దాల్చిన వైనం
- భర్తకు సైతం తెలియనివ్వని భార్య
- అబ్బాయి పుడితే చెప్పి.. అమ్మాయి పుడితే వదిలించుకుందామనుకున్న మహిళ
- అమ్మాయే పుట్టడంతో తుప్పల్లోకి..
- గుర్తించిన స్థానికులు. బయటపడిన నిజం



కడియం, ఏప్రిల్ 15: మగ సంతానంపై మమకారం పెంచుకున్న తల్లి మానవత్వం మరిచి అప్పుడే పుట్టిన పసికందును 20 అడుగుల ఎత్తులో నుంచి తుప్పల్లోకి విసిరేసింది. తర్వాత తన తప్పు తెలుసుకుని కన్నీరుపెట్టింది. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగింది. స్థానికులు, బంధువులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమగిరి గణపతినగర్‌కు చెందిన తాపీ పనిచేసే వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు.. వారు ప్రస్తుతం స్కూలుకు వెళుతున్నారు. అయితే సదరు వ్యక్తి భార్యకు మగసంతానంపై మమకారంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నట్టు నమ్మించి గర్భం దాల్చింది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది. అబ్బాయి పుడితే అందరికి చెబుదాం.. అమ్మాయి పుడితే మాయం చేద్దాం అనే ఉద్దేశంతో ఉంది. బంధుమిత్రులకు, పరిసర ప్రజలకు విషయం తెలియకుండా దాచింది. భర్తకు కూడా అనుమానం రాకుండా చేసింది. పొట్ట పెరుగుతుందని భర్త అనడంతో ఈ మధ్య తినడంతో పెరుగుతుందని నమ్మించింది. స్థానిక వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు తాను గర్భిణీ అనే విషయం ఇవ్వక పోగా అందుకు సంబంధించి వైద్య సేవలు పొందలేదు. ఆదివారం పురుటినొప్పులు వచ్చాయి. అది గమనించి తన భర్తను, పిల్లలను చర్చికి పంపింది. తనకు తానే పురుడు పోసుకుంది. అందుబాటులో ఉన్న కత్తిపీటతో పేగును కత్తిరించింది. అమ్మాయి పుట్టిందని గమనించిన వెంటనే ముందుగా అనుకున్న పథకం ప్రకారం నైటీలో పసికందును చుట్టి 20అడుగుల ఎత్తు నుంచి తుప్పల్లోకి విసిరేసింది. అక్కడ చెత్తాచెదారం, పందులు ఉన్నాయి. అక్కడి నుంచి వెళ్లి స్నానం చేసి ఎవ్వరికీ తెలియనివ్వకుండా దాచింది. అయితే తుప్పలు నుంచి ఏడుపులు వినిపించడంతో చుట్టుప్రక్కల వారు వెళ్లి చూడగా ముద్దులొలికే ఆడశిశువు కనిపించింది. కాలికి చిన్నరాపిడి గాయం తప్ప క్షేమంగా ఉంది. పసికందు ఎవరనేది అందరిలో చర్చ మొదలైంది. బయట నుంచి అక్కడ ఎవరూ పసికందు పాడేసే అవకాశం లేనందున అక్కడి వారి పిల్లే అయి ఉంటుందని ఆరా తీశారు. ఇంతలో అందరితో పాటు భర్త వచ్చి చూస్తే పసికందుకు చుట్టి ఉన్న నైటీ కనిపించింది.. ఆ నైటీ తన భార్యదని గుర్తించాడు. ఆ నైటీ ఆధారంగా ఇంటికెళ్లి భార్యను నిలదీశాడు. దీంతో జరిగిన విషయం చెప్పింది. ఆపై ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. మగ సంతానంపై మమకారంతో ఇలా చేశానని గగ్గోలు పెట్టింది. తల్లీబిడ్డను కడియం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని బంధువులు, వైద్యులు తెలిపారు.

రేపు రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ

శ్రీరామ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 15: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు శ్రీరామ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిపై గతంలో నుంచి భౌతికంగా దాడులు జరుగుతూనే ఉన్నాయని ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలో నైతిక విలువలను పెంపొందించేందుకు శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమితి ఉపాధ్యక్షుడు గండేపూడి సురేష్ మాట్లాడుతూ ఈ ర్యాలీకి భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి ఆశీస్సులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో బండ్ల రామశంకర్, కర్రి శ్రీనివాస్, తాడోజు హరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ సత్తెమ్మతల్లి జాతర



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15: స్థానిక నారాయణపురం దేవస్థానాల వీధిలోని శ్రీ సత్తెమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజున ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. అమ్మవారి చీరలు వేలం వేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను దొడ్డా పద్మనాభం, ఆకేటి ఆదివిష్ణుమూర్తి, మానే దొరబాబు, దొడ్డా నరసింహమూర్తి, మానే ఆదిబాబు, వీరా శ్రీకృష్ణభగవాన్, కోలా వీరభద్రరావు తదితరులు పర్యవేక్షించారు.

జేగురుపాడులో అగ్ని ప్రమాదం



జేగురుపాడులో అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు

కడియం, ఏప్రిల్ 15: జేగురుపాడు బీసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు, ఓ పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మంగళగిరి శ్రీను, వడ్డాది లక్ష్మిలకు చెందిన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. దీంతో రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అలాగే బుడ్డిగ గోవిందుకు చెందిన పశువుల పాక కాలిపోయింది. దీంతో రెండు గేదెలు చనిపోగా ఒక ఆవుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకుని మంత్రి చెల్లుబోయిన వేణు, సర్పంచ్ యాదల స్టాలిన్, డాక్టర్ అనుసూరి పద్మలత జేగురుపాడు వెళ్లి బాధిత కుటుంబాలతో మాట్లాడారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్‌గురు
వై.స్క్రీన్ 2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి